
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States


## ఏపీలో మరో ఎన్నికల సమరం

- ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి: ఈసీ నీలం సాహ్ని



**అమరావతి,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** ఏపీలో త్వరలో ఎన్నికల మోత మోగనుంది. స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించి ఏపీ ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని అధికారులకు సూచనలు చేశారు. పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని నీలం సాహ్ని ఆదేశించారు. రానున్న సంవత్సరంలో ఏపీలో జరిగే ఎన్నిలకు సిద్ధంగా ఉండాలన్నారు. ప్రణాళికా బద్ధంగా మాస్టర్ ట్రైనర్ శిక్షణ, పోలీస్ బలగాలు, ఎలక్ట్రోరల్ రోల్ అంశాలపై దృష్టి పెట్టాలన్నారు.


సంపుటి : 24 | సంచిక : 43 | ది.12-4-2025 | విజయవాడ | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/-


# కూటమి ప్రభుత్వానిది సుపరిపాలన

- ప్రజలకిచ్చిన మాట నిలబెట్టుకున్నామనే నమ్మితున్నా
- పూలే స్ఫూర్తితో సంక్షేమ పాలన సాగిస్తున్నాం
- సంక్షేమంలో బీసీలకు అత్యధిక ప్రాధాన్యత
- సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తే సహించం
- చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- నూజివీడు నియోజకర్గంపై ప్రత్యేక శ్రద్ధ
- ఆగిరిపల్లి ప్రజావేదికలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఘనంగా పూలే జయంతి వేడుకలు నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం









**అమరావతి,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో సుపరిపాలన అందించేది కూటమి ప్రభుత్వం మాత్రమేనని, నాపైన ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెడతాననే విశ్వాసం ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ముఖ్యమంత్రి పదవి తనకు కొత్త కాదని, సమైక్యాంధ్రలో తాను చేసిన అభివృద్ధి చరిత్రలో నిలిచిపోతుందన్నారు. తనకు వేరే ఆశలు లేవని, మీ ప్రేమాభిమానాలు ఉంటే చాలని అన్నారు. మీ ఇంటికి పెద్దకొడుకుగా ఉంటానని చెప్పినట్టే రుజువు చేస్తున్నానని చెప్పారు. శుక్రవారం ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం వడ్లమానులో జరిగిన మహాత్మ జ్యోతీరావు పూలే జయంతి వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి అక్కడ ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో మాట్లాడారు.

**చరిత్ర మరిచిపోలేని గొప్ప వ్యక్తి పూలే :** చరిత్రలో శాశ్వతంగా నిలిచేపోయే చాలా కొద్ది మంది వ్యక్తుల్లో జ్యోతిరావు పూలే ఒకరు. బడుగు బలహీనవర్గాల ఆరాధ్య దైవం ఆయన. 198 ఏళ్లయినా ఇంకా పూలే జయంతి జరుపుకుంటున్నామంటే అదే ఆయన మనకు ఇచ్చిన స్ఫూర్తి. స్త్రీ విద్యకు ఆ రోజుల్లోనే అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. తన సతీమణిని ప్రోత్సహించి దేశంలోనే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా చేశారు. బాల్య వివాహాలు, సతీసహగమనాలకు వ్యతిరేకంగా పోరాడారు. రైతుల కష్టాలు తీర్చేందుకు కృషి చేశారు. అంబేద్కర్ సైతం ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలో నడిచారంటే పూలే గొప్పతనం అర్థం చేసుకోవచ్చు.

**రాష్ట్రంలో బీసీలకు న్యాయం చేసింది ఎన్టీఆర్ :** పూలే బాటలోనే మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు రాష్ట్రంలో మహిళా విద్యకు పెద్దపీట వేసి ఏకంగా మహిళా విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. తెలుగుదేశం పార్టీ స్థాపించే వరకు బీసీలకు న్యాయం జరగలేదు. బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని మొదటగా గుర్తించింది ఎన్టీఆర్. రాష్ట్రంలో బీసీలకు న్యాయం చేస్తున్న ఏకైక పార్టీ టీడీపీ. టీడీపీకి వెన్నుముక బీసీలు... బీసీలను ఆదరించే బాధ్యత టీడీపీది. తనతో సహా ప్రధాని నరేంద్ర మోదీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్... ఇలా అందరం బీసీల కోసం ఆలోచిస్తున్నాం... వారి కోసం పనిచేస్తున్నాం.

**బీసీల రక్షణ బాధ్యత టీడీపీది :** అట్రాసిటీ యాక్ట్ ద్వారా ఎస్సీ, ఎస్టీలకు ఎలా అయితే రక్షణ కల్పిస్తున్నామో, త్వరలో బీసీల కోసం ప్రత్యేకంగా రక్షణ చట్టాన్ని తీసుకువస్తాం. దీనిపై సబ్ కమటీ వేశాం. ఆ నివేదిక ఆధారంగా చట్టాన్ని రూపొందిస్తాం. స్థానిక సంస్థల్లో బీసీలకు మేం 34 శాతం



రిజర్వేషన్లు ఇస్తే, గత ప్రభుత్వ హయాంలో 24 శాతానికి తగ్గించారు. మేం మళ్లీ 34 శాతానికి మళ్లీ రిజర్వేషన్ పెంచుతాం. నామినేటెడ్ పోస్టుల్లో 33 శాతం బీసీలకు రిజర్వేషన్ అమలు చేస్తాం.

**బీసీలకు ఎంతో చేశాం... ఇంకా చేస్తాం :** నాయి బ్రాహ్మిణ్ ఫెడరేషన్, ఎంబీసీ ఫెడరేషన్, బీసీలకు కార్పోరే షన్లు, బీసీ భవన్‌లు, బీసీలకు ప్రత్యేక ప్రణాళిక, బీసీ విద్యార్థులకు రెసిడెన్షియల్ స్కూళ్లు, మత్స్యకార పిల్లల కోసం ప్రత్యేకంగా రెసిడెన్షియల్ స్కూళ్లు, విదేశాల్లో చదువు కునేలా రూ.15 లక్షలు ఒక్కో విద్యార్థికి ఆర్థిక సాయం, పోటీపరీక్షలకు ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు కోచింగ్, అలాగే బీసీ స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేసింది టీడీపీ. డీఎస్సీకి ప్రిపేర్ అయ్యే అభ్యర్థులకు ప్రతి జిల్లా నుంచి 220 మందికి కోచింగ్ అందిస్తాం. ఆదరణ-3ని తీసుకువస్తాం.

**బీసీల ఆదాయం పెరిగేలా ప్రత్యేక కార్యక్రమాలు :** బీసీల కులవృత్తులు దెబ్బతిన్నాయి. వారి ఆదాయం పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు తీసుకువస్తున్నాం. కల్లుగీత కార్మికులకు మద్యం షాపులు కేటాయిస్తున్నాం. నేతన్నలకు ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. బీసీలకు సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకునేందుకు 2 కిలోవాట్లకు రూ.80,000, 3 కిలోవాట్లకు రూ.98 వేలు ప్రత్యేకంగా సబ్సిడీ ఇస్తున్నాం. దేవాలయాల్లో పనిచేసే నాయిబ్రాహ్మిణ్‌లకు రూ.15,000 ఉన్న వేతనాన్ని రూ.25,000 వేలు చేశాం.

**ఆగిరిపల్లిలోనూ అన్నా క్యాంటిన్ :** అందరి ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటిన్లు పెట్టాం. మీ గ్రామంలోనూ త్వరలోనే అన్నా క్యాంటిన్ పెడతాం. డ్వాక్రా సంఘాలు నా మానస పుత్రికలు... లక్ష మంది మహిళల్ని పారిశ్రామిక వేత్తలు చేయాలనుకుంటున్నా. మా అమ్మ కష్టాలు ఎవరికీ కలుగకూడదని దీపం-2 పథకం కింద ఉచితంగా 3 సిలండర్లు ఏడాదికి ఇస్తున్నాం. ఎంతమంది పిల్లలుంటే అంతమంది పిల్లలకు 'తల్లికి వందనం' పథకం కింద రూ.15,000 చొప్పున ఇస్తాం. అన్నదాతలకు మే నెల నుంచి ఏడాది రూ. 20,000 ఇస్తాం. అలాగే మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో పరిహారం ఇస్తాం. సంపద సృష్టించి సంక్షేమానికి ఖర్చు పెడతాం. అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేస్తే రాష్ట్రం మరింత నష్టపోతుంది.



**పార్థసారథికి అండగా ఉంటాను :** నూజివీడు నియోజవ ర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే వరకు మంత్రి కొలుసు పార్థసారధికి అండగా ఉంటాను. నూజివీడులో జనాభావృద్ధి కూడా తగ్గుతోందని, ప్రతి దంపతులు కనీసం ఇద్దరు చొప్పున పిల్లల్ని కనాలి. చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు గత ప్రభుత్వ హయాంలో కోర్టు వివాదాల్లో చిక్కుకుపోయింది. మేము ఆ వివాదాలు త్వరగా పరిష్కారమయ్యేలా చూసి... ప్రాజెక్టు పూర్తి చేస్తాం.

**స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోవద్దు :** సోషల్ మీడియా నేరస్తులకు అడ్డాగా మారింది. సోషల్ మీడియా ద్వారా ఎవరి వ్యక్తిత్వ హననం చేసినా వాళ్లకు అదే చివరి రోజు అవుతుంది. పిల్లలను మంచి పౌరులుగా తల్లిదండ్రులు తీర్చిదిద్దాలి. తప్పు చేసిన వాళ్ల విషయంలో చండశాసనుడిగా ఉంటా. వివేకానంద రెడ్డిది గుండెపోటు అని మొదట జరిగిన ప్రచారాన్ని నమ్మి మోసపోయా, తర్వాత తెలిసింది అది గొడ్డలి పోటు అని. తప్పుడు ప్రచారం చేసినా, తప్పుగా మాట్లాడినా చర్యలు తప్పవు. గత ప్రభుత్వ హయాంలో ఎవరూ స్వేచ్ఛగా తిరగలేదు. మా ప్రభుత్వంలో ఇచ్చిన స్వేచ్ఛను ఎవరూ దుర్వినియోగం చేసుకోకండి.

# భవిష్యత్ అవసరాలకు తగినట్లుగా డ్రైపోర్ట్

- ఆర్‌ఆర్‌ఆర్ పనులు వేగవంతం చేయాలి..
- ఎన్‌హెచ్‌ల భూ సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలి..
- ఆర్‌ఆర్‌ఆర్, ఎన్‌హెచ్‌లపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** రానున్న వందేళ్ల అవసరాలకు అనుగుణంగా డ్రైపోర్ట్‌కు రూపకల్పన చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. ఆర్‌ఆర్‌ఆర్ సమీపంలో సరైన ప్రాంతంలో డ్రైపోర్ట్ ఉండాలని సీఎం అన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణం... ఆర్‌ఆర్‌ఆర్ పనుల పురోగతిపై ఐసీసీసీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఇటీవల రాష్ట్ర పునర్విభజన అంశాలపై ఢిల్లీలో జరిగిన తెలంగాణ, ఏపీ అధికారుల సమావేశంలో హైదరాబాద్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణానికి అవసరమైన డీపీఆర్ తయారీకి సూత్రప్రాయ ఆమోదం తెలపాలని కేంద్ర హోం శాఖ కార్యదర్శి ఆదేశించిన నేపథ్యంలో ఆ పనులపై దృష్టిసారించాలని సీఎం సూచించారు. రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగానికి సంబంధించిన భూ సేకరణ పూర్తి చేయాలని, దక్షిణ భాగం డీపీఆర్ కన్సల్టెన్సీ నివేదికను త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరాన్ని ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌తో అనుసంధానించేలా జాతీయ రహదారికి ప్రతిపాదనలు తయారు చేసి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు (ఎన్‌హెచ్‌ఏఐ) పంపించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు కొత్త జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల నిర్మాణానికి సంబంధించి భూ సేకరణలో ఎదురవుతున్న ఇబ్బందులపై సీఎం ఆరాతీశారు. పలు చోట్ల పంటలు ఉన్నాయని, పంట నష్టపరిహారం చెల్లించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ అంగీకరించడం లేదని అధికారులు సీఎంకు వివరించారు. పంట కాలం దాదాపు పూర్తవుతున్నందున ఆ వెంటనే రైతులతో మాట్లాడి భూ సేకరణ పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. భూ సేకరణకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే ఆయా జిల్లాల కలెక్టర్లతో ప్రత్యేకంగా మాట్లాడాలని, సాంకేతిక, న్యాయ సమస్యలు ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సూచించారు. ఔటర్ రింగు రోడ్డు నుంచి రీజినల్ రింగు రోడ్డు వరకు రేడియల్ రోడ్లు.. ఆర్‌ఆర్‌ఆర్ నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు ఉన్న రహదారుల విస్తరణపైనా ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం అన్నారు. సమీక్షలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్ అండ్ బీ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, ముఖ్య ఇంజినీర్లు తిరుమల, జయభారతి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వం అంటే ఇదీ.. బాబు గురించి జాతీయ మీడియా..!



**అమరావతి,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** ప్రభుత్వం అంటే ఇదీ.. అంటూ జాతీయ మీడియా ఏపీలోని చంద్రబాబు నేతృత్వంలో ఉన్న కూటమి సర్కారుపై ప్రశంసలు గుప్పించింది. నేటితో చంద్రబాబు పాలనకు పది నెలలు పూర్తయిన నేపథ్యంలో పలు మీడియా చానెళ్లు ఆయన పాలన, రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమం, పెట్టుబడులు సహా.. వివిధ అంశాలను ప్రస్తావించాయి. కొన్ని పత్రికలు.. బాబు మారలేదు.. అంటూ వ్యాఖ్యానించడం గమనార్హం. డిజిటల్ విప్లవం, ఐటీ, పెట్టుబడుల అంశాలను ప్రస్తావించాయి. ఈ సందర్భంలోనే కొందరు విశ్లేషకులు 1995 పాలనను పోల్చుతూ.. పాలనలో పారదర్శకతకు పెద్ద పీట వేస్తున్నారని.. అయితే.. అప్పటికి.. ఇప్పటికి కొంత మార్పు అయితే కనిపించిందని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా ప్రజల వద్దకు పాలన పేరుతో ఒకప్పుడు తీసుకువచ్చిన వ్యవస్థ సక్సెస్ కావడంతో ఇప్పుడు కూడా అదే పాటిస్తున్నారని.. అయితే, అప్పట్లో అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందిని పంపిస్తే.. ప్రస్తుతం సీఎం చంద్రబాబు స్వయంగా ప్రజల వద్దకు వెళ్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మరీ ముఖ్యంగా 'విజన్' అనే మాట ద్వారానే చంద్రబాబు గతంలో సక్సెస్ అయ్యారన్నది కూడా.. పత్రికలు పేర్కొంటున్న వాస్తవం. దీనిని ఆయన ఇప్పుడు కూడా కొనసాగిస్తున్నారని.. వికసిత ఆంధ్రప్రదేశ్ 2047 లక్ష్యం పెట్టుకుని ఆయన వేస్తున్న అడుగులు రాష్ట్రానికి మరిన్ని మేళ్లు చేస్తాయని చెబుతున్నాయని చెబుతున్నారు. అదేవిధంగా ప్రస్తుతం ప్రవచిస్తున్న పీ4 విధానం సాకారం అయితే.. రాష్ట్రంలో పేదరిక నిర్మూల సాధ్యమైనంత వరకు తగ్గుముఖం పట్టవచ్చని పేర్కొనడం గమనార్హం. గత ప్రభుత్వాలకు.. ఇప్పుడు అనుసరిస్తున్న విధానాలకు కూడా.. చంద్రబాబు చాలా వ్యత్యాసం చూపిస్తున్నారని కూడా.. జాతీయ మీడియా పేర్కొనడం గమనార్హం. ఒకప్పుడు మిత్రపక్షాలైన కమ్యూనిస్టులను ఆయన పెద్ద పట్టించుకున్న పరిస్థితి కనిపించేది కాదని.. కానీ, ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోని మిత్ర పక్షాలకు అన్ని స్థాయిల్లోనూ ప్రాధాన్యం కల్పిస్తున్నారని పత్రికలు పేర్కొంటున్నాయి. వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మోడీ వేస్తున్న అడుగులు మిత్ర పక్షాల మధ్య సఖ్యతను ఈ సందర్భంగా ప్రస్తావిస్తుండడం విశేషం.


## దేవాదాయ ధర్మాదాయ శాఖ

కృష్ణా జిల్లా గూడూరు మండలం గూడూరు గ్రామములో వేంచేసియున్న శ్రీ మాధవ స్వామి దేవస్థానమునకు చెందిన భూములు ఈ దిగువన ఉదహరించిన విధముగా టెండర్-కం-బహిరంగ కౌలు వేలం పాట నిర్వహించబడును.

| సంఖ్య | గ్రామం | మండలం | R.S. No. | Extent | స్థలం |
|---|---|---|---|---|---|
| 1. | లేళ్ళగరువు | గూడూరు మండలం | 61/1,2 | 9-50 | గ్రామపంచాయితీ ఆఫీసు, లేళ్ళగరువు ది. 17-4-2025 ఉదయం 10-00 గంటలకు |
| 2. | జక్కంచర్ల | గూడూరు మండలం | 39/1,2 | 5-93 | గ్రామపంచాయితీ ఆఫీసు, జక్కంచర్ల ది. 17-4-2025 మధ్యాహ్నం 12-00 గంటలకు |
| 3. | కలపటం | గూడూరు మండలం | 84/1,2 | 6-71 | గ్రామపంచాయితీ ఆఫీసు, కలపటం ది. 17-4-2025 మధ్యాహ్నం 3-00 గంటలకు |
| 4. | కంకటావ | గూడూరు మండలం | 262<br>265/1,2<br>130 | 21-80 | గ్రామపంచాయితీ ఆఫీసు, కంకటావ ది. 19-4-2025 ఉదయం 10-00 గంటలకు |
| 5. | గాదేపూడి | గుడ్లవల్లేరు మండలం | 6<br>7/1,2 | 11-51 | గ్రామపంచాయితీ ఆఫీసు, గాదేపూడి ది. 19-4-2025 మధ్యాహ్నం 3-00 గంటలకు |
| 6. | సుల్తానగరం | బందరు మండలం | 313 | 8-76 | గ్రామపంచాయితీ ఆఫీసు, సుల్తానగరం ది. 21-4-2025 ఉదయం 10-00 గంటలకు |
| 7. | కంచడం | బంటుమిల్లి మండలం | 85<br>110/1,2<br>87 | 24-57 | గ్రామపంచాయితీ ఆఫీసు, కంచడం ది. 21-4-2025 మధ్యాహ్నం 3-00 గంటలకు |

ఇతర వివరములకు దేవస్థానము అధికారులను సంప్రదించి తెలుసుకోవలెను.

ఇట్లు

గూడూరు

తేది : 11-4-2025

కలపటపు నవరంగ్ కిషన్

ఫౌండరు ఫ్యామిలీ మెంబర్


## మహాత్మా జ్యోతిబా పూలే సమాజానికి అందించిన సేవలు మరువలేనివి : సిఎస్ విజయానంద్



**విజయవాడ,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** మహాత్మా జ్యోతిబా పూలే 199 వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం విజయవాడ సిఎస్ క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు.అదే విధంగా రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా తదితర అధికారులు పాల్గొని జ్యోతిబా పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. సందర్భంగా సిఎస్ విజయానంద్ మాట్లాడుతూ సమాజానికి పూలే అందించిన సేవలు ఎనలేనివని మహారాష్ట్రలో జన్మించిన కుల వ్యతిరేక కార్యకర్త,రచయిత,ఆలోచనా పరుడు మరియు సామాజిక సంస్కర్త జ్యోతిబా పూలే అని పేర్కొన్నారు.అదే విధంగా భారతదేశంలో సామాజిక మార్పును పెంపొందించడంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదని పేర్కొన్నారు.ఆయన జయంతి రోజైన నేడు దేశ పౌరులు బహుముఖ ప్రజ్ఞాశాలైన సామాజిక సంస్కర్త గురించి ప్రతి ఒక్కరూ తెల్సుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.అంతేగాక జ్యోతిబా పూలే భార్య సావిత్రిబాయి పూలే భారతదేశంలో మహిళల విద్య కోసం విశేష కృషి చేశారని చెప్పారు.ఫూలే సమాజానికి చేసిన సేవలను గుర్తుంచుకుని సామాజిక సంస్కర్తగా ఆయన కాలంలో ఎదుర్కొన్న ఇబ్బందులు మరియు చేసిన త్యాగాలను కూడా మనం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని సిఎస్ అన్నారు. 1873లో కుల వ్యవస్థ వల్ల కలిగే సామాజిక ఆర్థిక అసమానతలను తిప్పికొట్టడానికి "సత్యశోధక్ సమాజ్" అనే సంస్కరణ సంఘాన్ని పూలే స్థాపించారని సిఎస్ విజయానంద్ ఈసందర్భంగా గుర్తు చేశారు.పూలే బాల్య వివాహాలను వ్యతిరేకించడం తోపాటు వితంతు పునర్వివాహం చేసుకునే హక్కును సమర్ధించారని సిఎస్ విజయానంద్ గుర్తు చేశారు.ఈకార్యక్రమంలో రాష్ట్ర సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# మంత్రుల విషయంలో చంద్రబాబు సంచలన నిర్ణయం.. తొలగింపు!



**అమరావతి,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** ఏపీ సీఎం చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. పాలనాపరమైన నిర్ణయాలతో పాటు ప్రభుత్వపరంగా చిన్నపాటి లోటుపాట్లు కనిపించిన సరిదిద్దే ప్రయత్నం చేస్తున్నారు. ఈ క్రమంలో మంత్రుల విషయంలో కూడా ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. ఇప్పటికే మంత్రులకు ర్యాంకులు ఇస్తున్నారు. సమర్థవంతంగా పనిచేయాలని సూచిస్తున్నారు. ఒక్క మంత్రులే కాదు.. ఆ పేషీలో ఉన్న కీలక అధికారులు, సిబ్బంది వ్యవహార పైన కూడా ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఏమాత్రం ఆరోపణలు వచ్చినా వెంటనే దర్యాప్తు చేసి చర్యలకు ఉపక్రమిస్తున్నారు.

**కఠిన చర్యలు..** తాజాగా మంత్రుల విషయంలో సీఎం చంద్రబాబు తీసుకున్న నిర్ణయం సంచలనంగా మారింది. కూటమి ప్రభుత్వంలో పారదర్శకమైన పాలన అందించే క్రమంలో.. మంత్రులు వ్యక్తిగత, పేషీ సిబ్బంది విషయంలో ఏ రకమైన విమర్శలకు తావు లేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారు సీఎం చంద్రబాబు. కొంతమంది మంత్రుల పేషీలో సిబ్బందిపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా హోంమంత్రి వంగలపూడి అనిత సిబ్బంది విషయంలో ఆరోపణలు రావడంతో వెనువెంటనే తొలగించారు. ఆ తరువాత కొంతమంది మంత్రులు ఎలా అయ్యారు. అయితే ఇప్పుడు మరో మంత్రి పేషీలో కీలక అధికారిపై చర్యలు తీసుకోవడంతో ఒక్కసారిగా పరిస్థితి వేడెక్కింది.

**ఓఎస్డీలు, పేషీ సిబ్బందిపై ఫిర్యాదులు..** ప్రధానంగా కొంతమంది మంత్రుల ఓఎస్డీలు, పేషీ సిబ్బందిపై విమర్శలు ఎక్కువగా వస్తున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ఉన్న వారిని కొనసాగించడం పై ఫిర్యాదులు ఉన్నాయి. మరి కొంతమంది కీలక మంత్రుల వద్ద ఉన్న అధికారులు, సిబ్బంది పనితీరుపై ఫిర్యాదులు రావడంతో నివేదికలు కోరారు సీఎం చంద్రబాబు. వాటిని ఆధారంగా చేసుకొని చర్యలకు దిగుతున్నారు. తాజాగా మంత్రి కొల్లు రవీంద్ర ఓ ఎస్ డి తొలగింపు వ్యవహారం మంత్రుల వద్ద చర్చగా మారింది. ఎక్సైజ్, గనుల శాఖ మంత్రిగా ఉన్న కొల్లు రవీంద్ర వద్ద ఓఎస్డీగా పనిచేస్తున్నారు రాజబాబు. ఆయనను పక్కన పెట్టింది కూటమి ప్రభుత్వం. వాస్తవానికి రాజబాబు గనుల శాఖ అధికారి. అక్కడ జాయింట్ డైరెక్టర్ గా పని చేస్తూ 2024 మార్చిలో పదవీ విరమణ చేశారు. అయితే ఆయనను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొల్లు రవీంద్ర ఓ ఎస్ డి గా నియమించుకున్నారు. ఆ సమయంలోనే చాలా రకాల విమర్శలు వచ్చాయి. అయితే నాడు మంత్రి కొల్లు రవీంద్ర లెక్క చేయలేదు..

**గత పది నెలలుగా ఆరోపణలు..** అయితే గత పది నెలల కాలంలో రాజబాబు వ్యవహార శైలిపై అనేక రకాల ఆరోపణలు వచ్చాయి. అవన్నీ సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్లాయి. వీటిపై నివేదికలు తెప్పించుకున్నారు సీఎం చంద్రబాబు. ఇప్పుడు ఏకంగా ఓఎస్డినే తప్పించాలని ఆదేశించారు. దీంతో ప్రభుత్వం తనను తప్పించబోతుందన్న వార్త తెలుసుకున్న రాజబాబు తనకు తాను స్వచ్ఛందంగా తప్పుకునేందుకు ముందుకు వచ్చినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పుడు మంత్రులకు సంబంధించి ఓ ఎస్ డి లు, ఇతరత్రా అధికారులపై బలమైన చర్చ నడుస్తోంది. చాలామంది అధికారుల తీరుపై అభ్యంతరాలు ఉన్నాయి. దీంతో మరిన్ని తొలగింపులు ఉంటాయని తెలుస్తోంది.

# మహాత్మ జ్యోతిరావు పూలే 198 జయంతోత్సవం



శేరిలింగంపల్లి,ఏప్రిల్ 11: (వార్తాప్రభ):మహాత్మ జ్యోతిరావు పూలే 198 జయంతి పురస్కరించుకొని శుక్రవారం మియాపూర్ డివిజన్ లో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు గుండె గణేష్ మరియు సురేష్ ముదిరాజ్ ల ఆధ్వర్యం లో ఆర్.బి.ఆర్ కాంప్లెక్స్ దగ్గర జయంతి ఉత్సవ కార్యక్రమాలు జరపడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు రాచమల్ల నాగేశ్వర్ గౌడ్,కలివేముల మనోహర్ డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్ ముదిరాజ్మరియు విజేందర్సింగ్ ,శివరాజ్,కే.ప్రసాద ్,మన్యం జాగీరావు,రాము,ముఖేష్, రవికాంత్,అప్పారావ ,చందు,నరేష్,హరి తదితరులు ఉన్నారు

# భూకంపం పుకార్లు నమ్మవద్దు!!

- సింగరేణి కార్మికులు ధైర్యంగా ఉండండి
- సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేస్తాం
- సింగరేణి ఆర్జీవన్ జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్




పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 11 (వార్తాప్రభ ప్రతినిధి)రామగుండం ప్రాంతంలో సోషల్ మీడియా వేదికగా వస్తున్న భూకంపం పుకార్లు నమ్మవద్దు అని సింగరేణి ఆర్జీవన్ జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్ సింగరేణి కార్మికులు కార్మిక కుటుంబాలకు తెలియజేశారు. ఎపిక్ ఎర్త్ క్వేక్ రీసర్చ్ అనాలిసిస్ సంస్థ ఎక్స్ వేదికగా చేసిన పోస్ట్ ఎన్.జి.ఆర్.ఐ. ( నేషనల్ జియో ఫిజికల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ) కొట్టి పారేసినట్లు గుర్తు చేశారు. తెలంగాణ ప్రాంతం అత్యంత సురక్షితమైన ప్రాంతంగా తెలియజేశారు. వదంతులు నమ్మకుండా సింగరేణి కార్మికులు, కార్మిక కుటుంబాలు ధైర్యంగా ఉండాలని సూచించారు. అధికారిక సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేస్తామని అన్నారు.

# చందానగర్ పోలీస్ ఇన్స్పెక్టర్ గా సుంకరి విజయ్




శేరిలింగంపల్లి, ఏప్రిల్ 11 (వార్తాప్రభ): చందానగర్ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ గా సుంకరి విజయ్ నియమితులయ్యారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న సుంకరి విజయ్ ని చందానగర్ ఇన్ స్పెక్టర్ గా బదిలీ చేస్తూ సైబరాబాద్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా ఇక్కడ ఇన్ స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న పాలవెల్లి సైబరాబాద్ క్రైమ్స్ విభాగానికి బదిలీ అయ్యారు. కాగా సుంకరి విజయ్ కుమార్ గురువారం సాయంత్రం పాలవెల్లి నుంచి చార్జ్ తీసుకున్నారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ సుంకరి విజయ్ మాట్లాడుతూ..పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని,అసాంఘిక కార్యకలాపాల పై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు.ఈ క్రమంలో పలువురు నాయకులు పాలవెల్లికి వీడ్కోలు,విజయ్ కి స్వాగతం పలికారు.

# ఘనంగా కాంగ్రెస్ నాయకులు బండారు శ్రీనివాస్ ముదిరాజ్ జన్మదినోత్సవం



శేరిలింగంపల్లి,ఎప్రిల్ 11 (వార్తాప్రభ):శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని మియా పూర్ కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బం డారు శ్రీనివాస్ ముదిరాజ్ జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం రోజు వారి నివాసంలో మియాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బండారు మోహన్ ముదిరాజ్,బండారు మహేందర్ ముదిరాజ్,ఇతర పార్టీ నాయకులతో కలిసి శాలువతో సత్కరించి ప్రత్యేక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మిత్రులు,నాయకులు కుటుంబ సభ్యులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పండరి,ప్రసాద్ ముదిరాజ్,భగత్ ముదిరాజ్,సురేష్ ముదిరాజ్, విజయ్ ముదిరాజ్,యాదయ్య, హనుమంతరావు ,యాదగిరి ,చిరంజీవి ముదిరాజ్ తదితరులు ఉన్నారు

# కాంగ్రెస్ సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జనరల్ సెక్రటరీగా కొలిపాక సాయి కిరణ్ నియామకం

జవహర్ నగర్, ఏప్రిల్ 11:(వార్తా ప్రభ)కాంగ్రెస్ సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జనరల్ సెక్రటరీగా కొలిపాక సాయి కిరణ్ ను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ రాష్ట్ర అధ్యక్షులు తెల్ల శ్రవణ్ కుమార్ గురువారం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.సాయి కిరణ్ సేవాదళ్ ఉద్యమ లక్ష్యాలను ప్రజల్లోకి చైతన్యంగా చాటిచెప్పి, నిబద్ధతతో సేవలందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ ప్రగతికి ఆయన విశేషంగా కృషి చేస్తారని నాయకత్వం విశ్వాసం వ్యక్తం చేసింది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ సేవాదళ్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇంచార్జ్ రేణు కుమార్ కూరాకుల పాల్గొన్నారు. వారు సాయి కిరణ్‌కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూగతంలో అనేక సామాజిక, రాజకీయ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న సాయి కిరణ్, యువతలో చైతన్యం కలిగించడంలో ముఖ్యపాత్ర పోషించారు. నియామకాన్ని జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ కార్యకర్తలు, నాయకులు స్వాగతించారు. ఆయన నాయకత్వంలో



సేవాదళ్ కార్యకలాపాలు మరింత విస్తరించనున్నాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ రాష్ట్ర అధ్యక్షులు తెల్ల శ్రావణ్ కుమార్, మరియు కాంగ్రెస్ సేవాదళ్ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఇన్చార్జి రేణు కుమార్ కూరాకుల, మరియు జవహర్ నగర్ బ్రిగేడ్ యూత్ ప్రశాంత్ తిమోతి, కీర్తన పౌల్, కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మా ఫూలే సేవలు ఆదర్శనీయం!!

- మహాత్మ జ్యోతిరావు పూలే గొప్ప సంఘసంస్కర్త
- పూలే విగ్రహం ఆవిష్కరించడం గొప్ప అదృష్టం
- జై బాపు.. జై భీమ్.. జై బీసీ.. కాంగ్రెస్ నినాదం
- రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్





పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 11 (వార్తాప్రభ ప్రతినిధి)మహాత్మ జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని, అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలన, మహిళోద్ధరణకు ఎంతో కృషి చేశాడని రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కొనియాడారు. ఈ మేరకు శుక్రవారం మహాత్మ జ్యోతిరావు పూలే 199వజయంతి సందర్భంగా గోదావరిఖని రాజేష్ థియేటర్ టీ జంక్షన్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమానికి, అలాగే ఓపెన్ కాస్ట్ 5 ప్రాజెక్టు గని వద్ద పూలే విగ్రహావిష్కరణ కార్యక్రమానికి రామగుండం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా పూలే విగ్రహం ఆవిష్కరించి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు ఎమ్మెల్యే. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...... బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం పోరాటం చేస్తున్న రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య సేవలు అభినందనీయమని వారితో కలిసి పూలే విగ్రహం ఆవిష్కరించడం గొప్ప అదృష్టం అని తెలిపారు. పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించిన సింగరేణి బీసీ అసోసియేషన్ సభ్యులను ప్రతి ఒక్కరూ అభినందించాలన్నారు. యువత జ్యోతిబాపూలే సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఉద్యోగ, ఆర్థిక రంగాలలో మరింతగా ఎదగడమే పూలేకు మనమిచ్చే నిజమైన నివాళి అని అన్నారు. జై బాపు.. జై భీమ్.. జై బీసీ.. కాంగ్రెస్ నినాదం అని తెలిపారు.

# జిల్లాలో ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ మస్ట్!!

- 20కి పైగా తండాలు ఉన్న జిల్లాకు అధికారిని నియమించండి
- సామాజిక, విద్య, ఆర్థిక అభ్యున్నతిని ప్రోత్సహించండి
- సత్వర పరిష్కారం కోసం అధికారి 100%అవసరం
- విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ మెంబర్ భూక్య సాయిరాం నాయక్



పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 11 (వార్తాప్రభ ప్రతినిధి)జిల్లాలో ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ మస్ట్ అనే అంశంపై తెలంగాణ గిరిజన శాఖ ట్రైకార్ రాష్ట్ర చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ దృష్టికి తీసుకువెళ్ళారు విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ మెంబర్ భూక్య సాయిరాం నాయక్. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్ కార్యాలయంలో చైర్మన్ ను కలిసి విజ్ఞప్తి పత్రం అందించారు. 20కి పైగా తండాలు ఉన్న జిల్లాకు గిరిజన సంక్షేమ అధికారిని నియమించండి అని విజ్ఞప్తి పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. సామాజిక, విద్య, ఆర్థిక అభ్యున్నతిని ప్రోత్సహించడానికి ఆ ఫలాలు త్వరగా లబ్ధిదారులకు చేకూరడానికి, సమస్యలు సత్వర పరిష్కారం కోసం అధికారి అవసరం 100% ఉందని తెలిపారు. ఈ దిశగా వీలైనంత త్వరగా జిల్లా గిరిజన సంక్షేమ అధికారిని నియమించి సమస్యను పరిష్కరించాలి అని కోరారు.

# స్త్రీ నిధి సంస్థపై దుష్ప్రచారం మానుకోవాలి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 11 (వార్తాప్రభ ప్రతినిధి)కొత్తగూడెం : స్త్రీ నిధి సంస్థపై కొందరు వ్యక్తులు చేస్తున్న దుష్ప్రచారం మానుకోవాలని స్త్రీ నిధి ఉద్యోగుల సమాఖ్యా రాష్ట్ర అధ్యక్షుడు మూడు సంపత్ కుమార్ అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత కొంతకాలంగా సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులపై సంస్థకి సంబంధం లేని వ్యక్తులు వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నారని తెలిపారు. సంస్థలో అక్రమాలు జరిగాయంటూ పుకార్లు పుట్టిస్తూ సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని తెలిపారు. కొంతమంది సంస్థలో లేని వ్యక్తులు ఉద్యోగ సంఘంలో రాష్ట్ర నాయకులు అంటూ చెలామణి అవుతున్నారని తెలిపారు. కానీ స్త్రీ నిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లో ఉద్యోగ సంఘాలు లేవని అన్నారు. స్త్రీ నిధి సంస్థ నందు ఎటువంటి నిర్ణయాలు తీసుకోవాలన్న బోర్డు డైరెక్టర్లు ఆమోదం మెరకే జరుగుతుందని, మహిళా సంఘాల ప్రతినిధులే డైరెక్టర్లు గా బాధ్యతలు నిర్వహిస్తారని తెలిపారు. ఇప్పటికైనా స్త్రీ నిధి సంస్థపై అసత్య ప్రచారాలు మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సురేష్ కుమార్, పెనుగురి మహేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# మహామనిషి జ్యోతిబాపూలే

*తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ ఆక్షన్ కమిటీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి.*
*జవహర్ నగర్ లో జరిగిన జ్యోతిబాపూలే 199 వ జయంతి.*
*తెలంగాణ జేఏసీ నాయకులు బండకింది సింగరయ్య గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమం.*



జవహర్ నగర్, ఏప్రిల్ 11:(వార్తా ప్రభ)మెజారిటీ ప్రజలైన నిమ్న జాతి వర్గాల ప్రజలకు మహామనిషి మహాత్మా జ్యోతిరావు పూలే అని తెలంగాణ ఉద్యమ కారుల జాయింట్ ఆక్షన్ కమిటీ చైర్మన్ సుల్తాన్ యాదగిరి కొనియాడారు. 2025, ఏప్రిల్-11, శుక్రవారం రోజు మేడ్చల్ మల్కాజిగిరి, కాప్రా, జవహర్ నగర్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని ధళిత సంక్షేమం భవన్ లో జ్యోతిరావు పూలే 199 వ జయంతి సభ జరిగింది. తెలంగాణ ఉద్యమ జాయింట్ ఆక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆ సంస్థ రాష్ట్ర నాయకులు బండకింది సింగరాయ్య గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలకు చెందిన నేతలు పాల్గొని ప్రసంగించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుల్తాన్ యాదగిరి ప్రసంగిస్తూ ఎన్నో వేల సంవత్సరాలుగా పంచములకు విద్య అందని ద్రాక్షపండుగా ఉన్న సమయంలో వారిలో అక్షర జ్ఞానాన్ని అందించిన మహాయోదుడు జ్యోతిరావు పూలే అని పేర్కొన్నారు. మహిళల ఉనికికి, వారి అభివృద్ధికి పూలే దంపతుల క్రుషి, పట్టుదల నేటి సామాజిక అభివృద్ధి లో వారి పాత్రను మరువలేమని అన్నారు. పూణేలో బాలిక పాఠశాల ఏర్పాటుతో దేశ భవిష్యత్తుకు బాటలేశారని అన్నారు. సతీసహగమనాన్ని, అంటరాని తనాన్ని వ్యతిరేకంగా ఉద్యమించారని గుర్తుచేశారు. వితంతు విహాలను ప్రోత్సహించి, సమానత్వం కోసం పరితపించిన వ్యక్తి మహాత్మా జ్యోతిబాపూలే అని కీర్తించారు. ఇలాంటి క్రమంలో అసమానతలు, బాల్య వివాహాలు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాటం జరిపిన పూలే దంపతుల ఆశయాల సాధనలో సమసమాజ స్థాపనలో నడుం కట్టాలని సుల్తాన్ యాదగిరి పిలుపునిచ్చారు. ఈపై కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గడ్డం శ్రీనివాస్, సిపిఎం శివన్నారాయణ, నగేష్, బీఎస్పీ బిర్రు యాకస్వామి, సుప్రియ రెడ్డి, పీఓడబ్ల్యూ(విముక్తి) పి.సునీత, మహనీయుల ఉత్సవ కమిటీ సాక్షి సురేందర్, పరుశురాం, టియుజేఏసి ప్రఫుల్ రాంరెడ్డి, చర్చల చంద్రన్న ప్రసాద్, తెలంగాణ ఉద్యమ కళాకారుల వేదిక ఏ.యాదగిరి, డోలక్ యాదగిరి, తెలంగాణ ఉద్యమ మహిళా వేదిక బాకారం లావణ్య, సిజి, బహుజన రక్షణ సమితి విజయ్ శంకర్ మరియు ఐ.ఎఫ్.టి.యు. షేక్ షావలి తదితరులు పాల్గొన్న వారిలో ఉన్నారు. అనంతరం జ్యోతిబాపూలే చిత్రపటానికి పుష్పాంజులతో నివాళులు అర్పించారు.

# వార్తా ప్రభ హైదరాబాద్

# ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు

*ఘన నివాళులు అర్పించిన మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్,*





జవహర్ నగర్, ఏప్రిల్ 11:(వార్తా ప్రభ) మహిళా సాధికారతకు కృషి చేసిన మహనీయుడు, సంఘ సంస్కర్త, మానవతా మూర్తి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళు లర్పించిన ..మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షులు మండల సురేందర్, కుల, ప్రజా, సంఘాల నాయకులు, మహిళలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు...

# బిజెపి ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 11 (వార్తాప్రభ ప్రతినిధి) చుంచుపల్లి, మండలంలోని గాంధీ కాలనీలో పిఎం విశ్వకర్మ జిల్లా కోఆర్డినేటర్, బిజెపి జిల్లా నాయకులు ఆకుల నాగేశ్వరరావు గౌడ్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావులి పూలే 199వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బిజెపి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి పాల్గొని మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక బుద్ధుడు-మహాత్మ జ్యోతిరావు పూలే, ఆధునిక భారతదేశ చరిత్రలో సామాజిక పనివర్తన ఉద్యమాలకు బలమైన పునాది వేసిన ప్రముఖ గొప్ప వ్యక్తులలో మహనీయులు మహాత్మ జ్యోతిరావు పూలే జగమెరిగిన సత్యం అని అన్నారు సామాజిక తత్వవేత్త ఉద్యమకారుడు, సంఘ సేవకుడు అయినా గోవిందరావు పూలే చిమ్నా బాయ్ దంపతులకు మహారాష్ట్రలోని సతారా జిల్లాలో ఏప్రిల్ 11- 1827 సంవత్సరంలో జ్యోతిరావు పూలే జన్మించారు అని పిశ్వ పరిపాలన కాలంలో పూల వ్యాపారం చేయటం వాళ్ల వారి ఇంటిపేరు పూలే మార్పు గా చెందిందని పూలేకి చిన్నప్పటినుండి చత్రపతి శివాజీ మహారాజ్ అంటే అభిమానం ఎక్కువ. అందువల్ల శివాజీ, జార్జ్ వాషింగ్టన్ ల జీవిత చరిత్రలు ప్రభావితం చేయటం మూలంగా పూలే లో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు ఎక్కువగా ఉండేవి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు కొదమ సింహం పాండురంగ చార్యులు, అసెంబ్లీ కన్వీనర్ టీ. నరేంద్రబాబు, బైరి నిర్మలా, మండల అధ్యక్షులు రాయుడు నాగేశ్వరరావు, గొడుగు శ్రీధర్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# బస్సు ఢీ వ్యక్తి మృతి

*కుమారుడికి గాయాలు*
*కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్ఐ రమాదేవి*



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 11 (వార్తాప్రభ ప్రతినిధి) సుజాతనగర్. మండల కేంద్రంలో ఆర్టీసీ బస్ ఢీకో ని శుక్రవారం వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. పోడియం దినేష్ (39) స్వస్థలం చతిస్గడ్ రాష్ట్రం సుకుమా జిల్లా చెందిన వ్యక్తి కాగా కూలి పనుల నిమిత్తం ప్రస్తుతం ములకపల్లి మండలం ధర్మ నగర్ వద్ద నివసిస్తున్నాడు. సుజాతనగర్ సెంటర్లో కుమారుడితో రోడ్డు దాటుతుండగా భద్రాచలం డిపో కు చెందిన ఆర్టీసీ బస్సు ఖమ్మం నుంచి కొత్తగూడెం వైపు వస్తు వారిని ఢీకొట్టింది హుటాహుటిన కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా దినేష్ మృతి చెందినట్లుగా వైద్యులు నిర్ధారించారు. కుమారుడికి గాయాలు కాగా ఆ అబ్బాయికి మాటలు సరిగ్గా రాక.. అది తెలుగు భాష కాకపోవడంతో, కొద్దిసేపు ఎవరు, ఎక్కడివారు అనేది ఎవరికి అర్థం కాకుండా పోయింది.మృతుడి బంధువులు వచ్చే వారికి కూడా సమాచారం తెలియ రాలేదు. మృతుడికి భార్య లక్ష్మి,ఒక కుమారుడు నాలుగు సంవత్సరాల వయసు కాగా ముగ్గురు కుమార్తెలు కూడా మూడు సంవత్సరాలు రెండు సంవత్సరాలు ఒక సంవత్సరం వారు కావటంతో మానవీయ కోణంలో చాలా బాధాకరమైన సంఘటనగా భావించవచ్చు. మృతుడి తమ్ముడు పాండు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుజాతనగర్ ఎస్ఐ రమాదేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఎడిటోరియల్

## టెక్నాలజీ, టారిఫ్‌లు: ప్రపంచ రాజకీయాల్లో పెనుమార్పులు

ప్రపంచ భౌగోళిక రాజకీయాల్లో ఇప్పుడు రెండు అంశాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అవే టెక్నాలజీ , టారిఫ్‌లు . ఈ రెండింటి ప్రాధాన్యతను వివరిస్తూ భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి. దిల్లీలో జరిగిన కార్నెగీ గ్లోబల్ టెక్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడుతూ, ఈ రెండు 'టి'ల మధ్య ఉన్న సంబంధాన్ని విశ్లేషించారు.ప్రస్తుత పరిస్థితుల్లో టెక్నాలజీ, టారిఫ్‌లు ప్రపంచాన్ని శాసిస్తున్నాయా అనే ప్రశ్న సహజంగానే తలెత్తుతుంది. జైశంకర్ మాటలను బట్టి చూస్తే, ఈ రెండు అంశాలు ప్రపంచ రాజకీయాలను, ఆర్థిక వ్యవస్థలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని స్పష్టమవుతోంది. ఆయన ఈ పరిస్థితిని ఒక అవకాశంగా చూడటం విశేషం.జైశంకర్ తన ప్రసంగంలో అమెరికా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రపంచంతో అమెరికా అనుసంధానమయ్యే విధానంలో వస్తున్న మార్పులు, ముఖ్యంగా టెక్నాలజీ రంగంలో దాని ప్రభావం చాలా తీవ్రంగా ఉంటుందని ఆయన అన్నారు. అమెరికా అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ కావడంతో పాటు.. ఆ దేశం సాధిస్తున్న సాంకేతిక పురోగతి ప్రపంచవ్యాప్తంగా మార్పులకు నాంది పలుకుతోంది. "మేక్ అమెరికా గ్రేట్ అగైన్" నినాదానికి, టెక్నాలజీకి మధ్య ఉన్న సంబంధాన్ని ఆయన గుర్తు చేశారు. 2016 నుంచి 2020 మధ్య ఈ విషయం మరింత స్పష్టంగా కనిపించిందని ఆయన అభిప్రాయపడ్డారు.అంతేకాకుండా చైనా సాధిస్తున్న స్థిరమైన వృద్ధిని, ఐరోపాలో నెలకొన్న ఆర్థిక అనిశ్చితిని కూడా జైశంకర్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. అయితే ఆయన ప్రధానంగా దృష్టి సారించింది టెక్నాలజీ, టారిఫ్‌లపైనే.గత కొంతకాలంగా ప్రపంచవ్యాప్తంగా టారిఫ్‌ల గురించే ఎక్కువగా వినిపిస్తోంది. ముఖ్యంగా డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా అయ్యాక ఆయన తీసుకున్న కఠినమైన టారిఫ్ విధానాలు ప్రపంచ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపాయి. మరోవైపు సాంకేతిక రంగంలో కృత్రిమ మేధ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఈ విషయంలో అమెరికా, చైనా దేశాల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది.దేశాభివృద్ధిలో టెక్నాలజీ యొక్క పాత్ర ఎంతో కీలకమైనదని జైశంకర్ నొక్కి చెప్పారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు ప్రపంచ దేశాలు తమ విధానాలను రూపొందించుకునే విషయంలో టెక్నాలజీ , టారిఫ్‌ల యొక్క ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేస్తున్నాయి. రానున్న రోజుల్లో ఈ రెండు 'టి'లు ప్రపంచ రాజకీయాలను ఏ విధంగా మలుపు తిప్పుతాయో వేచి చూడాలి.

## పంట చేల్లో దిష్టిబొమ్మల్లోనూ ఆధునిక పోకడలే......

**పాత కాలపు సంప్రదాయ దిష్టిబొమ్మలకు పాతరే......**





**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వంగతోట..వరిచేలు, చెరుకు తోట,నిమ్మ తోట,మామిడి తోట, ఏ పంట చేలు చూచినా గత కాలంలో దిష్టిబొమ్మలు వింత వింత ఆకృతిల్లో తయారు చేసి చేలల్లో నిలబెట్టేవారు. ఇవన్నీ వరిగడ్డితో వెంగ్యంగా ,వితగొలిపే మానవాకృతిలో ఉండేవి తల మాత్రం మట్టి కుండ బోర్లించి ముక్కు, మూతి, కళ్ళు, చెవుల డిజైన్లు ఆర్ట్ వేసేవారు. ఓ వెదురు కర్ర మెడవద్ద కట్టి మగవారి పాత చొక్కా తొడిగేవారు. రాను రాను ఆలోచనలు మార్పులు వచ్చాయి. కొందరు గుమ్మడి కాయలు గెడకర్ర కు కట్టి చేలో నిలబెట్టేవారు. ఐతే ఏ పంటైనా దిగుబడి అధికంగా ఉంటే పల్లెటూర్లులో ఆనోటా..ఈ నోటా ఊరంతా టామ్ టామ్ అన్నట్టుగా జనాల్లోకి వెళ్లి పంట చేలవద్దకు జనాలు పరుగులు తీయడం జరుగుతుంది. ""నరుని కంట బడిన నల్లరాయి సైతం నుజ్జు అవుతుంది"" అనే నానుడి ఉంది. అందుకే దిష్టిబొమ్మల సంప్రదాయం తెరపైకి వచ్చింది. ఐతే రాను రాను దిష్టిబొమ్మ స్థానంలో నాజూకైన నడుము, కనురెప్పలు మూయలేని కనికట్టు నాభి,పదే పదే చూడలనిపించే పయ్యద వున్న అందమైన అమ్మాయి పోల్ బ్యానర్ తయారు చేయించి వంగతోట లో పెట్టి బాటసారుల దృష్టి వంగతోట పై గాకుండా అందాలు అరబోసే అతివ బొమ్మపై పడేట్టుగా చేస్తున్నారు. పాత సినిమా లో ఓ పాట ""వంగతోట కాడా ఒళ్ళు జాగ్రత్తా.... చుప్పనాతి కళ్ళు గుచ్చి గుచ్చి చూస్తాయి""అనే పాటను గుర్తు చేస్తున్నట్టుగా... బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గ పరిధిలోని చెరుకుపల్లి మండలం లోని యేమినేని వారి పాలెం కి చెందిన దామెర్ల అంకమరావు వ్యక్తి తన వంగ తోటలో ఏర్పాటు చేసిన అందమైన అతివ బ్యానర్ ని స్థానికులు రెప్పలార్చకుండా చూస్తున్నారు. దాంతో జనాల దృష్టి ఏపుగా పెరిగిన వంగ తోటపై పడకుండా దృష్టి మళ్లిస్తున్న అంకమరావు అమలుకు చేసిన ఈ ఐడియా కి స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## దోమల నివారణకు ఫ్రైడే డ్రైడే కచ్చితంగా పాటించాలి






**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దోమల వల్ల కలిగే వ్యాధుల నుండి నివారణ కొరకు ఫ్రైడే డ్రై డే నిర్వాహనతో ప్రజలకు అవగాహన కల్పించాలని విజయవాడ నగరపాలక సంస్థఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం రామకృష్ణ పురం, వార్డు-30,బుడమేరు కాలువ ప్రాంతాలలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు అవగాహన కల్పించారు. అందులో భాగంగా అక్కడ నివసిస్తున్న ప్రజల వారి ఇళ్లలో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ప్రతి ఫ్రైడే డ్రై డే నిర్వహించాలని, వారికి అవగాహన కల్పిస్తూ దోమలు పెరగకుండా యాంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించడం వల్ల ప్రజలు దోమలను కచ్చితంగా, దోమ కాటు వల్ల అనారోగ్యం పాలవకుండా ఉండవచ్చని సిబ్బంది ప్రజలతో అవగాహన కల్పించారు.అంతేకాకుండా సైడ్ డ్రైన్లలో పూడికలు తీయడం, ఎమెల్ ఆయిల్స్ స్ప్రే చేయటం కలగట్ల వద్ద ఫాగింగ్ చేయడం వంటి ఆంటీ లార్వా ఆపరేషన్లు నిర్వహించి దోమలను నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నారు అధికారులు.ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్ మలేరియా వర్కర్లు పాల్గొన్నారు.

## బాబా ప్రశాంతి నిలయంలో అయ్యప్ప స్వామికి అభిషేకాలు





**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**అయ్యప్ప స్వామి వారి పుట్టినరోజు ను పురస్కరించుకొని శ్రీ ఈశ్వర పుత్ర భక్త బృందం వారి ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేట లో బాబా ప్రశాంతి నిలయం లో గురువారం అయ్యప్ప స్వామి వారి పంచలోహ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఈశ్వర పుత్ర భక్త బృందం గురుస్వామి కామరాజ్ హరీష్ కుమార్ ఆచారి, బాబా ప్రశాంతి నిలయం నిర్వాహకులు భోగవల్లి పృథ్వి సాయి కుమార్, పూజ కైంకర్యాలు నిర్వహించగా అయ్యప్ప భక్తులు అభిషేక కార్యక్రమంలో పాల్గొని అయ్యప్ప స్వామి నామస్మరణతో కనులవిందుగా అభిషేక కార్యక్రమం కొనసాగింది.అనంతరం అష్టోత్తరపూజలునిర్వహించి తీర్థప్రసాదాలు పంపిణి చేసారు.ఈ కార్యక్రమంలో బాబా ప్రశాంతి నిలయం సభ్యులు భోగవల్లి పార్వతి, సత్తిరాజు,అనిల్,శ్రీనివాసన్,నాగోతి సాయి కుమార్,కుమార్ రెడ్డి,పవన్ శ్రీ కళ్యాన్, ఈశ్వర పుత్ర భక్త బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్డీఏ కార్యాలయంలో మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి వేడుకలు

**నివాళులర్పించిన కూటమి నేతలు**



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి )**మహాత్మ జ్యోతిరావు పూలే జయంతిని శుక్రవారం భవానిపురం ఎన్డీఏ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్,ఎన్డీఏ కూటమి నేతలు స్థానిక ప్రజలు పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ .. సమ సమాజ నిర్మాణంలో పూలే కీలకపాత్ర పోషించారన్నారు. స్త్రీ ,పురుష సమానత్వం కోసం జీవితాంతం కృషి చేశారని కొనియాడారు. ఆయన జీవితం ఆదర్శమని స్ఫూర్తిదాయకమని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య, జనసేన 47 వ డివిజన్ అధ్యక్షులు వేంపలి గౌరీ శంకర్, సమ్మెట రాజా నాయుడు, టీడీపీ డివిజన్ అధ్యక్షులు పీవీ చిన్న సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే. మాజీ ఎమ్మెల్యే డిఎన్ఆర్.



**కైకలూరు ఏప్రిల్ 11 (వార్తా ప్రభ)**భారతదేశ గతిని ఉన్నతి వైపు తిప్పిన మహా నుభావులు ఎందరో, అలాంటి వారిలో ఒకరు జ్యోతి రావు పూలే,భార్య సావిత్రిబాయి తో కలిసి ఆయన స్త్రీ విద్యకు మార్గదర్శిగా నిలిచారు. అణగారిన వర్గాల ఆశాజ్యోతి గా పిలవబడే మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం మనకి ఆదర్శప్రాయం అని ఏలూరు జిల్లా వైయస్సార్సీపి అధ్యక్షులు, కైకలూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు దూలం నాగేశ్వరరావు అన్నారు. ఈరోజు మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా కైకలూరు, కోరుకొల్లు రోడ్ లో గల మహాత్మ జ్యోతి రావు పూలే విగ్రహానికి పూలమాలవేసి ఘనమైన నివాళులు అర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ,జ్యోతిరావు పూలే వితంతువుల దయనీయ పరిస్థితులను గ్రహించి,యువ వితంతువుల కోసం ఒక ఆశ్రమాన్ని స్థాపించారని,వర్ణ వ్యవస్థ వెలుపల తరచుగా ఉంచబడిన అణగారిన ప్రజానీకాన్ని చిత్రీకరించడానికి దళిత్ అనే పదాన్ని మొదట ఉపయోగించింది పూలే అని చాలామంది నమ్ముతారని, అంతేకాక దేశంలోనే మొట్టమొదటిసారిగా ఆడపిల్లల కోసం నడిపే మొదటి పాఠశాలను ప్రారంభించింది.ఆ మహనీయుడు పూలేనే అని డిఎన్ఆర్ అన్నారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు వైయస్సార్సీపి రాష్ట్ర ముదిరాజ్ సంఘ అధ్యక్షులు కోమటి విష్ణువర్ధన్,వైయస్ఆర్సీపీ రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి%ఊ% ముదినేపల్లి మండలం ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ,రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి సయ్యపురాజు గుర్రాజు,జిల్లా అధికార ప్రతినిధి మొట్రూ యేసుబాబు,జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీ%ఊ% పెంచికలమర్రు గ్రామ సర్పంచ్ జయమంగళ కాసులు,కైకలూరు మండల పార్టీ అధ్యక్షులు సింగంశెట్టి రాము,కొర్రగుంటపాలెం గ్రామ సర్పంచ్ పేరే రామకృష్ణ, అయ్యవారి రుద్రవరం గ్రామ సర్పంచ్ బోణం శేషగిరి, నియోజకవర్గ క్రిస్టియన్ మైనారిటీ సెల్ విభాగ అధ్యక్షులు కుర్మా నేహేమియా,నియోజకవర్గ ఆర్.టి.ఐ విభాగ అధ్యక్షులు బోయిన చంద్ర భోగేశ్వర రావు,నియోజకవర్గ మైనారిటీ విభాగ అధ్యక్షులు మహమ్మద్ గాలిబ్ బాబు,నియోజవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు%ఊ% చిన్నతాడినాడ గ్రామ సర్పంచ్ గండికోట ఏసుబాబు,ఆచవరం ఎంపీటీసీ సభ్యులు బుర్ల నాగరాజు కలిదిండి మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పాము రవికుమార్ ,కైకలూరు మండలం కో ఆప్షన్ సభ్యులు సోమాల శ్యాంసుందర్,తమ్మిశెట్టి కొండ గారు, జాస్తి బాబ తదితరులు పాల్గొన్నారు.

## వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి, నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

**విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్**



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని నగరాన్ని పరిశుభ్రంగా ఉంచాలని విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా సర్కిల్ 1 పరిధిలో గల గాంధీ హిల్, పరిసర ప్రాంతాలని పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.జెండా చెట్టు వద్దగల లోడర్ పాయింట్ పరిశీలించారు, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని రోడ్లపైన వ్యర్థాలు ఎవరు వేయకుండా ఎప్పటికప్పుడు ఇంటి వద్దనే సేకరణ చేసేటట్టు చర్యలు తీసుకోవాలని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని అధికారులను ఆదేశించారు. లోడర్ పాయింట్లలో కూడా ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తూ పరిశుభ్రమైన వాతావరనాన్ని నెలకొల్పాలని తెలిపారు. గాంధీజీ వద్ద ఔట్ ఫాల్ డ్రైన్లో జరుగుతున్న డీజిల్టింగ్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు ఎక్స్కేటర్ ద్వారా తీస్తున్న వ్యర్థాలను పరిశీలించి ఎప్పటికప్పుడు వ్యర్థాలన్ని తొలగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.తదుపరి గాంధీ మహిళా కళాశాల వద్ద ఉన్న అన్న క్యాంటీన్ ను పరిశీలించారు, టోకెన్లు సమయానికి ఇస్తున్నారా లేదా, అన్న క్యాంటీన్ సమయపాలన పాటిస్తున్నారా లేదా, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూసుకుంటున్నారు లేదా వంటి అంశాలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలు ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాలకృష్ణ నాయక్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే సేవలు ఆదర్శనీయం



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సంఘసంస్కర్త, కుల వ్యవస్థ నిర్మూలనకు పాటుపడిన మహాత్మా జ్యోతిరావు పూలే సేవలు యువతకు ఆదర్శనీయమని కార్పొరేటర్ మైలవరపు దుర్గారావు పేర్కొన్నారు. విద్యాధరపురం ఆర్టీసీ బస్ డిపోలో శుక్రవారం పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఏపీ, పిటిడి ఆర్టీసీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు యస్ పి శేషగిరిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ , కార్పొరేటర్ మైలవరపు దుర్గారావు, ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మైలవరపు దుర్గారావు మాట్లాడుతూ పూలే గొప్ప సంఘసంస్కర్త అని అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలన మహిళోద్ధరణకు ఎంతో కృషి చేశారని కొనియాడారు.యువత జ్యోతిరావు పూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. యస్ పి శేషగిరిరావు మాట్లాడుతూ పూలే అణగారిన వర్గాల కోసం జీవితాన్ని ధారబోసిన మహనీయుడన్నారు .చదువులతోనే సమన్యాయం, అభివృద్ధి, సాధ్యమని మహిళా సాధికారత కోసం కృషి చేసిన వ్యక్తి పూలే అని ప్రశంసించారు. కార్యక్రమంలో విద్యాధరపురం ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్ ట్రాఫిక్ ఎం అప్పాజీ ,డిపో ప్రెసిడెంట్ కేఎం లక్ష్మణుడు, సభ్యులు జానకిరామ్, కే రాంబాబు, ఎంవి రావు డిపో సిబ్బంది,కూటమి నేతలు వెంపలి గౌరీ శంకర్, సప్పా శ్రీనివాస్ , దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## సంఘసంస్కర్త జ్యోతిరావు పూలే.......నేటి తరానికి ఆదర్శం,..





**విజయవాడ పశ్చిమఏప్రిల్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**బీసీ హక్కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే 198వ జయంతి కొత్తపేట బంగారే కొట్టు సెంటర్ లోని కార్యాలయం వద్ద గురువారం ఘనంగా జరిగింది. సంఘ నాయకులు రాయన చిన్ని, కోరగంజి రమణ, కొరికాని నాగు, హరి, కోళ్ల రజిని కుమార్, మాజీ కార్పొరేటర్ కోళ్ల సుధారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సిపిఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వరరావు, కార్పొరేటర్ బోయ సత్తిబాబు, లు పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి మాట్లాడుతూ మాట్లాడుతూ 1927 ఏప్రిల్ 11 మహారాష్ట్రలో జన్మించిన జ్యోతిరావు పూలే కేవలం 63 సంవత్సరాల మాత్రమే జీవించారు, వారి జీవిత కాలంలో కుల వివక్షతకు వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన పోరాట యోధుడని, అలాగే మంచి రచయితని కుల వివక్షత పై తనకున్న భావజాలాన్ని గ్రంధాల రూపంలో "గులాం గిరి" అనే ప్రసిద్ధి గ్రంధాలను రచించారు, మన జాతిపిత మహాత్మా గాంధీ కంటే ముందుగా పూలే మహాత్మాగా గౌరవించబడ్డారని, పూలే పోరాట స్ఫూర్తి, వారి జీవితం నాకు స్ఫూర్తిదాయకమని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ స్వయంగా ప్రకటించారని గుర్తు చేశారు, అలాగే మహిళలకు సమాన హక్కులు ఉండాలంటే చదువుల్లో మహిళలు ముందుకు రావాలని పిలుపునిచ్చి తన భార్య సావిత్రిబాయి పూలే చదువుకునేందుకు ప్రోత్సహించటం వలన సావిత్రిబాయి పూలే భారతదేశంలోని మొదటి మహిళా ఉపాధ్యాయులు కాబడ్డారని, సావిత్రిబాయి పూలే కూడా చదువుకునే కాలంలో అగ్రవర్ణాల వారి చేత చేదారింపులు, అవమానాలకు గురయ్యారని తెలియజేశారు. వారి పోరాట స్ఫూర్తి నేటి యువతరానికి ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు, అనంతరం ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని సంఘం వారి ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

## వైసీపీ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావ్ పూలే జయంతి



**రెడ్డిగూడెం ఏప్రిల్ 11 (వార్తాప్రభ ప్రతినిధి):**వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రెడ్డిగూడెంలో సామాజిక వేత్త మహాత్మ జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి చాట్ల రాబర్ట్ మాట్లాడుతూ అవిభాజ్య భారత దేశంలో సమానత్వం కోసం, సామాజిక న్యాయం కోసం పరితపించిన మహాత్మ జ్యోతిరావ్ పూలే నేటి తరానికి ఎంతో ఆదర్శనీయుడని కొనియాడారు. మహాత్మ జ్యోతిరావ్ పూలే ఆశయాలైన సామాజిక న్యాయం, సమానత్వం వైఎస్ జగన్మోహన్ రెడ్డితో నెరవేరుతుంది, ముఖ్యమంత్రి ఉన్న సమయంలో జగన్ జ్యోతిరావ్ పూలే దంపతుల ఆశలైన స్త్రీ విద్య అ, పేదలకు విద్య పట్ల ఎంతో బాధ్యతతో వ్యవహరించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెసు పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కుప్పిరెడ్డి వరప్రసాద్ రెడ్డి, మాజీ ఎంపీపీ మైలమాల కాంతారావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు గుడిసె ప్రభాకర రెడ్డి , మాజీ సర్పంచ్ గుడిసె జమలారెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పైడిమర్ల శ్రీనివాసరెడ్డి. గురజాల సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా ప్రారంభమైన శ్రీ షిర్డీ సాయిబాబా పాలరాతి శిలా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 11 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి బీ కాలనీ ఎన్టీఆర్ సెంటర్ వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో పాలరాతి శిలా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వైదిక కార్యక్రమాల్లో భాగంగా విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశనమృత్ సంగ్రహణం, అంకురారోపణ వాస్తు పూజ, వాస్తు హెూమం, నీరాజనం, తీర్థ ప్రసాద వినియోగం జరిగాయి. మెయిన్ రోడ్డు వెంబడి ఉన్న చిన్న సాయిబాబా (పాత) గుడిలో బాబా విగ్రహాన్ని ఊరేగింపు నూతన ఆలయానికి తీసుకొచ్చారు. భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఇష్టమైన తాతయ్య



తాత గారి పలుకులు
జుంటితేనె ధారలు
కథలూ,ఊసులతో
నింపుతాయి బొజ్జలు
తాత చెప్పు నీతులు
ఉద్ధరించు మాటలు
ఆలకిస్తే గనుక
దిద్దుతాయి బ్రతుకులు
ప్రేమగా నిమురుతూ
నేర్పుతాడు విలువలు
బజారుకెళ్ళితేజి
తెస్తాడు వస్తువులు
ఇష్టమైన తాతయ్య
ఇల్లంతా దీపము
మీసాల తాతయ్య
ప్రేమకు ప్రతిరూపము

-గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు

# మహిళల విద్య కోసం పోరాడిన గొప్ప సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే

## ఎంపి కేశినేని కార్యాలయంలో పూలే 199వ జయంతి కార్యక్రమం

**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దేశంలోనే తొలి బాలికా పాఠశాలను ప్రారంభించి మహిళల విద్య కోసం పోరాడిన గొప్ప సంస్కర్త, సమాజం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి కార్యక్రమం ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాయలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి నాయకులు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ సమాజంలో మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలతో నలిగిపోతూ అణగారిన బడుగు బలహీన వర్గాలకు మహాత్మా జ్యోతిరావు పూలే కొత్తదారి చూపించటంతో పాటు, చేయి పట్టి నడిపించారన్నారు. విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అని చాటిచెప్పారని వారి సేవలను కొనియాడారు.. భారతదేశంలో సామాజిక సంస్కరణ ఉద్యమానికి బీజం వేసిన మొదటి మహోన్నతుడు మహాత్మా జ్యోతిరావు పూలే అన్నారు. అంబేద్కర్, పూలే ఆదర్శాలకు అనుగుణంగా బడుగు బలహీన వర్గాల వారికి రాజకీయ అధికారాన్ని కల్పించిన ఘనత



తెలుగుదేశం పార్టీకి దక్కుతుందన్నారు. జ్యోతిరావు పూలే ఆశయ సాధనాల కోసం తెలుగుదేశం పార్టీ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షుడు నమ్మిభాను ప్రకాష్ యాదవ్, రాష్ట్ర పద్మశాలి డైరెక్టర్ సింగం వెంకన్న, మైలవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ ఉయ్యూరు నరసింహారావు,టి.ఎన్.టి.యు.సి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి పాల మాధవ , రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి పరిశపోగు రాజేష్ (దళితరత్న), రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీముల్లా, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ, ఎన్టీఆర్ జిల్లా బీసీ గౌడ్ సాధికారిక కన్వీనర్ పామర్తి కిషోర్ బాబు, ఎన్టీఆర్ జిల్లా బిసి సెల్ నాయకుడు ఉప్పడి రాము, పశ్చిమ నియోజకవర్గ బిసి సెల్ కార్యదర్శి చింతపల్లి సత్యనారాయణ, ఎన్టీఆర్ జిల్లా ఎమ్.ఎస్.ఎమ్.ఈ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్స్ మాదిగాని గురునాథం, మాజీ కార్పొరేటర్ కాకు మల్లిఖార్జున యాదవ్, బిసి సంఘ నాయకులు పట్నాల హరిబాబుటిడిపి సీనియర్ నాయకులు నరసింహా చౌదరి, నగర అర్బన్ మైనార్టీ సెల్ మాజీ అధ్యక్షుడు ఎమ్.డి.ఇర్ఫాన్, 7వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు పటమట సతీష్ చంద్ర, 44వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, 42వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు ముదిరాజు శివాజీ, 43వ డివిజన్ పార్టీ అధ్యక్షుడు కునికి కొండయ్య, టిడిపి నాయకులు ముదికొండ శివ, బోగవల్లి నాగబాబు, తమ్మిన శేఖర్, ఆర్యకటిక ఉమామహేశ్వరరావు, డబ్బుకొట్టు ఏడుకొండలు, నగరాల సాధికారత కమిటి కన్వీనర్ మరుపిళ్ల తిరుమలేష్, దేవరకళ్యాణ్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రెజ్లింగ్ క్రీడాకారులకు అభినందన



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఇటీవల రాజమండ్రి లో జరిగిన. రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో పతకాలు సాధించిన ఎస్ కె పి వి వి హిందూ హై స్కూల్ క్రీడాకారులను పాఠశాల కమిటీ కార్యదర్శి కె ఎల్ వి మోహనరావు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ ఎస్ కె పి వి వి హిందూ హై స్కూల్ కమిటీ చదువుతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. బాక్సింగ్,రెజ్లింగ్, రగ్బీ, ఫెన్సింగ్,తైక్వాడో క్రీడలకు పూర్తి క్రీడా సదుపాయాలు తమ పాఠశాలలో ఉన్నాయని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని పోటీల్లో చక్కటి ఫలితాలు సాధిస్తున్నారని కొనియాడారు.ప్రతి ఏడాది ఈ క్రీడల్లో తమ పాఠశాల నుంచి జాతీయ పోటీలకు రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారని,జాతీయ పోటీల్లో పతకాలు సాధించడమే లక్ష్యం గా తమ విద్యార్థులు సాధన చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో బి.కుమార్, సి హెచ్ తునిల్, లు బంగారు పతకాలు సాధించి జాతీయ పోటీలకు ఎంపిక అయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె శ్రీనివాసరావు తెలిపారు. అదేవిధంగా కె.యామిని,ఎస్.కుమార్ లు రజిత , సి హెచ్ మోహన వంశీ, సి హెచ్ కుమార్ రెడ్డి,ఎం.శివ నాగ లక్ష్మీ లు కాంస్య పతకాలు గెలుపొందారని తెలిపారు.పతకాలు సాధించిన విద్యార్థులను తర్ఫీదు ఇచ్చిన పి ఇ టి ఎం వి సత్య ప్రసాద్ ను కమిటీ అధ్యక్షులు టి.శేషయ్య,ప్రధాన కార్యదర్శి, కరస్పాండెంట్ గోపిశెట్టి మల్లయ్య,కోశాధికారి జి.బాబా విజయ కుమార్,పాఠశాల ఉపాధ్యాయ సంఘ కార్యదర్శి బి బ్రహ్మేశ్వరరావు లు అభినందనలు తెలిపారు.

## మహాత్మ జ్యోతిరావు పూలేను ఈ తరం వారు ఆదర్శంగా తీసుకోవాలి-ఎమ్మెల్యే కామినేని.



**కైకలూరు ఏప్రిల్ 11 (వార్తా ప్రభ)**ఏలూరు జిల్లా,కైకలూరు మండలం,కైకలూరు లో కోరుకొల్లు రోడ్డు నందు మహాత్మ జ్యోతిరావు పూలె 198వ జయంతి సందర్భంగా వారి విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించిన శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతు అంటరానితనం, కులవ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధారణకు కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలె అణగారిన వర్గాల అభ్యుదయానికి నిరంతరం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కార్త. మహిళలకు మరియు బడుగు బలహీన వర్గాల ప్రజలకు చదువు నందించిన విద్యా వేత్త తన భార్యకు తనే గురువుగా మరి విద్య నేర్పించారు.బాలికల కోసం 1948వ సంవత్సరాములో మొట్ట మొదటి బాలికల పాఠశాల ఏర్పాటు చేసి విద్యా ఆడ,మగ తేడాలేకుండా విద్యానందించాలని నిరంతరం పాటుపడిన పోరాట యోధుడు మహాత్ముడు జ్యోతిరావు పూలె,ఈ తరం వాళ్ళు అలాంటి మహా నీయులను ఆదర్శంగా తీసుకుని సమాజ స్థితి గతులను ప్రజలకు ఉపయోగపడేవిధంగా ఉండలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హాజ్రాత్ సయ్యద్ జలాలుద్దీన్ దర్వేష ఖాదిరి బాబా ఉరుసు మహోత్సవం



**ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 11(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి పట్నం లోని బీ కాలనీ వద్ద గల హాజ్రాత్ సయ్యద్ జలాలుద్దీన్ దర్వేష ఖాదిరి బాబా దర్గా ఉరుసు మహోత్సవం శుక్రవారం నాడు ఘనంగా నిర్వహించారు. బాబా వారికి చాదర్ మరియు గంధం సమర్పించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉరుసు మహోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దర్గా ముజావర్లు, ముస్లిం మత గురువులు, ప్రజలు ఉరుసు మహోత్సవంలో పాల్గొన్నారు.

# నవయుగ వైతాళికుడు జ్యోతిరావు పూలే

వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త మల్లాది విష్ణు

**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దేశంలో అక్షర జ్యోతిని వెలిగించిన మహనీయులు మహాత్మా జ్యోతిరావు పూలే అని వైసీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. పూలే జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రభ కాలనీలోని జనహిత సదనము నందు డిప్యూటీ మేయర్ అవుతు శ్రీ శైలజా రెడ్డితో కలిసి ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి శుక్రవారం ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి మహాత్మ పూలే అందించిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం మల్లాది విష్ణు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతికి జీవితాంతం పాటుబడిన దీనజన బాంధవుడు జ్యోతిరావు పూలే అని కీర్తించారు. 19వ శతాబ్దపు గొప్ప సంఘసంస్కర్తలలో అగ్రగణ్యులని.. సామాజిక సమానత్వం కోసం యుద్ధం చేసిన వైతాళికుడని కొనియాడారు. కులవివక్షని ప్రత్యక్షంగా అనుభవించిన ఆయన దానిని రూపుమాపేందుకు తుది శ్వాస వరకు కృషి చేశారన్నారు. బాల్యవివాహాలు, మూఢనమ్మకాలు, సతీ సహగమనానికి వ్యతిరేకంగా బలమైన ఉద్యమాన్ని నడిపారన్నారు. ఆయన రచనలు, ఉపన్యాసాలు ప్రత్యక్ష అనుభవాలతో నిండి ఉండేవన్నారు. దళిత, బహుజన వర్గాల అభ్యున్నతి కోసం పూలే ఆచరించిన కార్యాచరణ మహోన్నతమైనదని మల్లాది విష్ణు పేర్కొన్నారు. స్త్రీలకు విద్యను అందించడం కోసం తన భార్య



సావిత్రీబాయికి చదువు చెప్పి ఉపాధ్యాయురాలిగా మలిచిన మేధావి అని కొనియాడారు. కనుకనే పూలేను భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తన గురువుగా ప్రకటించుకున్నారన్నారు. విద్యతోనే సామాజిక ఆర్థిక సమున్నతికి బాటలు పడతాయన్న మహాత్మా పూలే ఆలోచన విధానమే మనందరికి స్ఫూర్తి అని చెప్పారు. పూలే ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు యరగొర్ల శ్రీరాములు, అలంపూర్ విజయ్, ఇసరపు రాజారమేష్, మేడా రమేష్, తోపుల వరలక్ష్మి, శ్యామ్, యర్రంశెట్టి అంజిబాబు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీకి సహకారం అందించండి

## - జిల్లా కలెక్టర్





**మచిలీపట్నం ఏప్రిల్ 11 (వార్తాప్రభ ప్రతినిధి)** జిల్లాలో స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీతో పాటు అవసరమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. శుక్రవారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల దృష్టికి వచ్చిన ఎన్నికల జాబితాలోని మార్పులు చేర్పులకు సంబంధించి అంశాలు ఏమైనా ఉంటే వాటిని జిల్లా ఎన్నికల అధికారి దృష్టికి తీసుకురావాలన్నారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ, క్లెయిమ్ లు, అభ్యంతరాల పరిష్కారం, అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పులు చేర్పులు వంటి అంశాలపై తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. గుడివాడ, మచిలీపట్నం గృహ సముదాయాలు అదేవిధంగా కరగ్రహారం లేఅవుట్లలోని గృహ సముదాయాలతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ లేఔట్లలోని గృహ సముదాయాలకు అవసరం మేరకు నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సిపిఎం ప్రతినిధి కొడాలి శర్మ కలెక్టర్ ను కోరారు. అదేవిధంగా టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్ జి టి) కు ఓటు హక్కు కల్పించే విధంగా చూడాలని కోరారు. తెలుగుదేశం పార్టీ ప్రతినిధి దిలీప్ కుమార్ మాట్లాడుతూ మచిలీపట్నం నగరంలో ఒక వీధిలో ఉండే ఇంటి నంబర్ల ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలాగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్వచ్ఛ ఓటర్ల జాబితా తయారీ, అదేవిధంగా అవసరమైన అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు సూచించిన సలహాలు, అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని భారత్ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖర రావు, మచిలీపట్నం ఆర్డీవో కే స్వాతి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పీవీ గజేంద్రరావు (బిజెపి), బి ఎం బి దాస్, దిలీప్ కుమార్ (టీడీపీ), కొడాలి శర్మ (సిపిఐ(ఎం)), ఎస్. బాలాజీ (బీఎస్పీపి), మచిలీపట్నం నగరపాలక సంస్థ మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, ఉత్తర, దక్షిణ తహసిల్దార్లు నాగభూషణం, మధుసూదన్ రావు, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దామాషా ఆధారంగా బీ.సీలకు 52 శాతం రిజర్వేషన్ కల్పించాలి

## బీ.సీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం డిమాండ్




**మచిలీపట్నం ఏప్రిల్ 11 (వార్తాప్రభ ప్రతినిధి)**జనాభా ప్రాతిపదికను ఆధారంగా చేసుకుని బీ.సీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీ.సీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు శేకుబోయిన సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. శుక్రవారం బీ.ఎస్పీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ధర్నా చౌక్ లో పార్టీ బి.సి నాయకులతో కలిసి బీ.సీ సమరభేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శేకుబోయిన సుబ్రమణ్యం మాట్లాడుతూ 15 శాతం ఉన్న ఓ.సీలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించి 52 శాతం ఉన్న బీ.సీలకు 27 శాతం మాత్రమే రిజర్వేషన్లు కల్పించడం వారి అభివృద్ధిని అడ్డుకోవడమే అని అన్నారు. బీ.ఎస్పీ కృష్ణాజిల్లా శాఖ అధ్యక్షులు గుంటూరు నాగేశ్వరరావు మాట్లాడుతూ బీ.సీలకు 27% మాత్రమే రిజర్వేషన్ కల్పించడంతో విద్యాసంస్థలు, ప్రభుత్వ ఉద్యోగాలు, ఉపాధి, రాజకీయ పదవులలో అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల రిజర్వేషన్లు 52 శాతం కి పెంచినప్పుడే వారికి పూర్తి న్యాయం జరుగుతుందని అన్నారు. బీ.ఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ పెగ్గెం ప్రసాద్ రావు మాట్లాడుతూ రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయని, వారి అభివృద్ధికి పాటుపడుతున్నట్లు కల్లబొల్లి మాయమాటలతో ఎప్పటికప్పుడు మభ్యపెడుతున్నాయన్నారు. జనాభా ఆధారంగా బీ.సీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించినప్పుడే వారికి సరైన న్యాయం జరుగుతుందన్నారు. బందరు నియోజకవర్గ అధ్యక్షులు సౌడాడ బాలాజీ, పెడన నియోజకవర్గం అధ్యక్షులు ఈడే కాశీ విశ్వేశ్వరరావు, గుడివాడ నియోజకవర్గం అధ్యక్షులు గుడివాడ బోసు, మచిలీపట్నం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బొమ్మిడి విజయ్, యూత్ వింగ్ నరసింహ, పలువురు బిఎస్పి , బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# రైతు సంఘం జెండావిష్కరణ



**ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం ఏప్రిల్ 11 (వార్తాప్రభ ప్రతినిధి)**ఒడ్డిగూడెం మండలం కేంద్రంలో ఆల్ ఇండియా రైతు సంఘం జెండావిష్కరణ కామ్రేడ్ ఉయ్యూరు కృష్ణారెడ్డి చే జరిగింది. దేశంలో రైతుల కోసం 90 క్రితం ఏర్పాటు అయిన ఆల్ ఇండియా రైతు సంఘం యొక్క చరిత్ర ఎంతో ఘనమైనదని రైతు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యం మాధవరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతే రాజు అన్న ఈ దేశంలో నేడు ఆ పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వ్యవసాయ వ్యతిరేక విధానాల చట్టాలను ఎదుర్కొవటంలో రైతు సంఘం విజయం సాధించిందనీ, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఉద్యమంలో రైతు సంఘం పాత్ర ఘనమైనదని తెలిపారు. అలాగే పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం కోసం రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన రైతు సంఘాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు నేడు దేశ వ్యాప్తంగా రైతు సంఘం జెండావిష్కరణ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అప్పిరెడ్డి, పెద్ద వెంకటరెడ్డి,బాబు, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## దాసాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కు రమ్మని సి ఎమ్ కి ఆహ్వానం

### ఆహ్వాన పత్రికను సి ఎమ్ కి అందించిన కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఏలూరు జిల్లా ఆగిరిపల్లి పర్యటన లో ఉన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు శుక్రవారం ఉదయం మర్యాద పూర్వకంగా కలిశారు. మిల్క్ ప్రాజెక్ట్ కామధేను ప్లాంట్, వీరవల్లి గ్రామం లో ఏప్రిల్ 16 వ తేదీన జరుగనున్న శ్రీ సీతారామ లక్ష్మణ సమేత దాసాంజనేయ స్వామి వారి ప్రతిష్ట మహోత్సవమునకు ఆహ్వాన పత్రికను అందించారు. ముఖ్యమంత్రిని ఆహ్వానించిన కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు సి ఎమ్ చంద్రబాబు నాయుడు తో మాట్లాడుతూ ఈ వేడుకకు తప్పనిసరిగా రావాలని విజ్ఞప్తి చేశారు.

## రెడ్డిగూడెం లో ఘనంగా మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి వేడుకలు,



**రెడ్డిగూడెం ఏప్రిల్ 11 (వార్తాప్రభ ప్రతినిధి):**రెడ్డిగూడెం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోమహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలుఆత్మీయంగా, ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలోతెలుగుదేశం పార్టీ నాయకుడు ముప్పిడి నాగేశ్వరరెడ్డి పాల్గొని మహానేత పూలే కిగౌరవంతో నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ –"మహాత్మా జ్యోతిబా పూలే సమాజంలో న్యాయాన్ని, విద్యా విలువను చాటిన వ్యక్తి.మహిళలకు విద్య అందించడంలో పూలే దంపతుల సేవలు చిరస్మరణీయమైనవి.పూలే ఆశయాలను యువత తెలుసుకోవాలి, పాటించాలి.అయన చూపిన మార్గమే మనకు మార్గదర్శకం." అనిమనసుని తాకేలా భావోద్వేగంగా మాట్లాడారు.వేడుకల లో టీడీపి నాయకులు పైడమర్ల కిరణ్ కుమార్ రెడ్డి పలువురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొని పూలే చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు.

## శ్రీ కనకదుర్గమ్మ వారికి బంగారు హారం బహుకరణ



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై శుక్రవారం అమ్మవారికి బంగారు హారం బహుకరించారు. ఆలయం అధికారులు తెలిపిన వివరాల ప్రకారం శ్రీ కనక దుర్గమ్మ వారికి హైదరాబాద్ అమీర్ పేట కు చెందిన దేవినేని సురేంద్ర 110 గ్రాముల తూకం గల బంగారు - హారం సమర్పించారు. శుక్రవారం ఉదయం దేవస్థానమునకు వచ్చిన సురేంద్ర ఆలయ కార్యనిర్వహణాధికారి కె. రామచంద్రమోహన్ కి ఆభరణం అందించారు.ఈ సందర్భంగా దాత కుటుంబీకులకు శ్రీ అమ్మవారి దర్శనం, ఆశీర్వచనం ఏర్పాటు చేసి, చిత్రపటం, ప్రసాదాలను దేవస్థానం నుండి అందించారు.

## మాజీ మంత్రి వెలంపల్లిని కలిసిన పశ్చిమ వైసిపి మండల పార్టీ అధ్యక్షులు



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నూతనంగా మండలం స్థాయిలో వైసీపీ పదవులు పొందిన నాయకులు శుక్రవారం మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ని మర్యాద పూర్వకంగా కలిశారు. బోండా నిరీష్, కేసరి కృష్ణా రెడ్డి, వాసా ఆదినారాయణ బాబు, అయితా కృష్ణ కిషోర్, బంకా చాముండేశ్వరి (చాము) లు ఆయన్ని కలువగా మండల పార్టీ అధ్యక్షులను సన్మానించిన మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు వారికి పలు సలహాలు సూచనలు చేశారు.స్థానిక బ్రాహ్మణ వీధిలోని పశ్చిమ వైసిపి కార్యాలయం లో శుక్రవారం ఇటీవల నూతనంగా నియమితులైన వైయస్ అర్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ మండల పార్టీ అధ్యక్షులు బోండా నిరీష్, కేసరి కృష్ణా రెడ్డి, వాసా ఆదినారాయణ బాబు, అయితా కిషోర్, బంక చాము లు మాజి మంత్రి, పశ్చిమ వైసిపి ఇంచార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావుని కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వెల్లంపల్లి శ్రీనివాసరావు పశ్చిమ మండల పార్టీ అధ్యక్షులకు శాలువాతో సన్మానించారు.పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వారికి సూచనలు చేశారు.

## మున్సిపాలిటీ ఆదాయం పెంచాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు పిలుపు సరే.....

● ఉద్యోగుల జీత భత్యాల ప్రస్తావన అటకెక్కిందా......● కనీస వేతనాలు లేని పారిశుధ్ధ్య కార్మికుల శ్రమ దోపిడీకి విలువ కట్టరా.......



(యేమినేని వెంకట రమణ)

**విజయవాడ పశ్చిమఏప్రిల్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మున్సిపాలిటీల ఆదాయం పెంచాలని అంకిత భావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని పురపాలికలు స్వయం సంవృద్ధి సాధించాలని రాష్ట్ర పురపాలక ,పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పిలుపుని ఆహ్వానిస్తున్నాం కానీ అదే సమయంలో రాష్ట్రంలో వెట్టి చాకిరికి గురౌతున్నా లక్షలాది మంది శానిటరీ సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వడంలేదనే అంశంపై మంత్రి నారాయణ దృష్టి సారించాలని పురపాలక కార్మికులు విజ్ఞప్తి చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కార్పోరేషన్, పురపాలక సంస్థలు, మండల,పంచాయతీ పరిధుల్లోని కార్మికులు నెలకు కేవలం రూ 8500 వేతనంతో మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. కనీస వేతనాలు అందని వారూ.... ఎన్నో సంవత్సరాలుగా రోజువారీ కూలీలుగా "చెత్త" బతుకుల మోక్షానికి నోచుకోలేదు. ప్రభుత్వాలు మారుతున్నా....నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నా... ""గొర్రె తోక బెత్తడే"" అన్న చందంగా మారింది. గత ఏడాది కంటే ఈ ఏడాది పన్నులు రూ 500 కోట్లు వసూలు చేసినందుకు మున్సిపల్ సిబ్బందిని మంత్రి అభినందించారు. అలాగే అదనపు ఖర్చులు తగ్గించడం వల్ల మున్సిపాలిటీలకు రూ 700 కోట్లు ఆదాయం వచ్చిందని గురువారం విజయవాడలో జరిగిన మున్సిపల్ కమిషనర్ల వర్క్ షాపులో మంత్రి నారాయణ స్వయంగా ప్రకటించారు. అంతా బాగానే ఉంది. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సర్వేచ్ఛ, ఫ్రైడే డ్రైడే,పచ్చదనం పరిశుభ్రత, తదితర కార్యక్రమాల నిర్వహణలో క్షేత్ర స్థాయిలో నిర్విరామంగా పని చేస్తున్న పారిశుధ్ధ్య కార్మికుల వేతనాలు పెంచాలని, కట్రాక్టు వర్కర్లు గా పని చేస్తున్న పారిశుధ్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని పారిశుధ్ధ్య కార్మికులు రాష్ట్ర ప్రభుత్వంని వేడుకొంటున్నారు.చెత్తా చెదారం లేకుండా రోడ్లు, సందు గొందుల్లో చెమటోర్చి పనిచేస్తున్న పారిశుధ్ధ్య కార్మికులు మంచి రోజులు కోసం ఎదురు చూస్తున్నారు.కుక్కలు, పిల్లులు, పందికొక్కులు, చివరకు అనాధల మృతదేహాలను సకాలంలో తొలిగించి ప్రజలకు దుర్గంధం నుండి విముక్తి కలిగిస్తున్నా....మురుగు రహిత నగరాలు, పట్టణాలు, మండలాలు, గ్రామ పంచాయతీలుగా కేంద్ర ప్రభుత్వ అవార్డులు అందుకోడానికి క్షేత్ర స్థాయిలో పాటు పడుతున్న పారిశుధ్ధ్య కార్మికులకు పర్మినెంట్ హెూదా కల్పించి కనీస వేతనాల పరిధిలోకి తేవాలని తద్వారా ఈ ఎస్ ఐ ,పీఎఫ్,ఈ పీఎఫ్ చౌకర్యాల కల్పనకు బాటలు వేయాలని రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎన్డీయే కూటమి తెదేపా ప్రభుత్వం ఐనా తమ దీర్ఘకాలిక ఆశలు నెరవేర్చాలని వారు కోరుతున్నారు.

## దేశ ప్రధమ సామాజికవేత్త మహాత్మ జ్యోతిరావు పూలే.

-ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్



**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 11 (వార్తాప్రభ):**మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని,చందానగర్ లో గల డఫ్ అండ్ డమ్ (చెవిటి మూగ) స్కూల్ నందు మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాన్ని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి,విద్యార్థినీ విద్యార్థులకు ఫ్రూట్స్ మరియు బిస్కెట్స్ అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ విచ్చేసి మాట్లాడుతూ,భారత దేశ ఆధునిక యుగ వైతాళికుడు మరియు ప్రధమ సామాజికవేత్త మహాత్మాపూలే అని కొనియాడారు.అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు,మహిళో ద్ధరణకు కృషిచేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా పూలే దంపతులు అని పూలే దంపతులు మహిళా విద్యకు మార్గదర్శకులు.1848 లో పూణేలో మొదటి బాలిక పాఠశాలను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.తరతరాలుగా అన్ని రకాలుగా అణచివేతకు వివక్షకు గురైన బడుగు బలహీన వర్గాలలో ఆత్మస్థైర్యము కలిగించి వారి హక్కులపై పోరాడి,సా ధికారిత కోసం కృషిచేసిన మహెూన్నతుడు పూలే అని అన్నారు.సాంఘిక సమానత్వం,సామాజిక న్యాయం కోసం ఆలోచించి,వారిలో చైతన్యం కలిగించారు.వితంతు వివాహాలను ప్రోత్సహించారు. అనేక అనాధ శరణాలయాలను ఏర్పాటు చేసి,ఎందరికో ఆశ్రయం కలిగించారు.వితంతువులైన గర్భిణీ స్త్రీలకు పురుడుబోసి,వారి జీవితాలలో వెలుగులు నింపిన మహా మనీషి అని పేర్కొన్నారు.తన జీవితాంతం బడుగు బలహీన వర్గాలకు మరియు స్త్రీల సర్వతోముఖాభివృద్ధికై కృషి చేసి వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయిన చిరంజీవులు పూలే దంపతులు అని కొనియాడారు.నేటి యువత వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని బడుగు బలహీన వర్గాల (బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనారిటీ) సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయటమే మనం వారికి అర్పించే నిజమైన నివాళి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ మెర్సీ,అధ్యాపకురాలు శోభా,మరియు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కౌండిన్యశ్రీ నందూరి వెంకటేశ్వరరాజు,పాలం శ్రీను, బాలరాజు,జనార్ధన్,జిల్ మల్లేష్, సుబ్బయ్య,చంద్రశేఖర్,విజయానంద్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేడ్కర్ - పూలే ఆలోచనలు అనుసరణీయం



కెయూ ఉపకులపతి ఆచార్య కె రాంజీ

**మచిలీపట్నం ఏప్రిల్ 11 (వార్తాప్రభ ప్రతినిధి)**కృష్ణా విశ్వవిద్యాలయం విద్య ఒక్కటే పేద ప్రజలు జీవితాలను మార్చుతుంది అని బలంగా నమ్మిన వ్యక్తులు బాబాసాహెబ్ డా బిఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే లు అని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె రాంజీ పేర్కొన్నారు. కృష్ణా విశ్వవిద్యాలయం ఎన్ ఎస్ ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం విశ్వవిద్యాలయం లో నిర్వహించిన డా బిఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశంలో మహిళల కోసం మొదటి పాఠశాల, వసతి గృహం ప్రారంభించిన వ్యక్తి పూలే అని, ఆయనను తన సామాజిక గురువుగా ప్రకటించుకున్న వ్యక్తి డా. అంబేడ్కర్ అని కొనియాడారు. వారిద్దరూ జీవితాలు యువతకు, విద్యార్థులకు అదర్శనీయమన్నారు. ఈ సందర్భముగా కృష్ణా విశ్వవిద్యాలయం కు బాబాసాహెబ్ డా బిఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం బహుకరించిన బాపట్ల జిల్లా రేపల్లె పట్టణం లో ఐఆర్ఈఎఫ్ సంస్థ ద్వారా విద్యా వ్యాప్తికి కృషి చేస్తున్న డా. రెబ్బా ఇమ్మానియేల్ ను ఉపకులపతి ఆచార్య కె రాంజీ ఘనంగా సత్కరించారు. తొలుత డా బిఆర్ అంబేడ్కర్ కాంస్య విగ్రహం కు, మహాత్మా జ్యోతిరావు పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.




**రక్తదానం చేసిన విద్యార్థులు**డా బిఆర్ అంబేడ్కర్ బి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు సందర్భముగా విశ్వవిద్యాలయ విద్యార్థులు రక్తదానం చేశారు. 40 మంది విద్యార్థుల స్వచ్ఛందంగా రక్తదానం చేయడం విశేషం. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. డా ఎం శ్రావణి ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డీన్ ఆచార్య వైకే సుందర కృష్ణ, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, ఆచార్య దిలీప్, సహాయ ఆచార్యులు డా ఎం బాబూరెడ్డి, పలువురు సహాయ ఆచార్యులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధిలో గన్నవరం ను రాష్ట్రంలోనే నెంబర్ వన్ గా నిలబెడతా - యార్లగడ్డ



**గన్నవరం : ఏప్రిల్ 11 (వార్తాప్రభ ప్రతినిధి)** గన్నవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పరంగా, ప్రజా సమస్యల పరిష్కారంలోనూ రాష్ట్రంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెడతానని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు భరోసా ఇచ్చారు. గన్నవరం నియోజకవర్గంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గ కేంద్రమైన గన్నవరం లో శుక్రవారం సాయంత్రం పలు అభివృద్ధి పనులను యార్లగడ్డ ప్రారంభించిన అనంతరం అయన మాట్లాడుతూ అరాచకాలు అక్రమాలతో అల్లాడిన గన్నవరం ప్రజలకు గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం విజయం తర్వాత ప్రశాంతత లభించిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో తాను ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. మల్లవల్లి పారిశ్రామివాడలో త్వరలో పూర్తిస్థాయిలో పరిశ్రమలు ఏర్పాటు అవుతాయని చెప్పారు. నియోజవర్గంలో 15 వేల మంది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చానని ఆమెకు ఆమెను నిలబెట్టుకునేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం, గ్రామపంచాయతీ, మండల పరిషత్ నిధులు మొత్తం రూ. 1.80కోట్ల ఖర్చు తో నూతనంగా నిర్మించిన పాత గన్నవరం లో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి దేవాలయం బజార్ రోడ్, చెంచుల కాలనీ, వీనస్ రోడ్డు, మండల ఆఫీసు ప్రహారీ గోడ, శ్రీనగర్ కాలనీ రోడ్డులను ప్రారంభించిన యార్లగడ్డ రాయనగర్లో ఎన్టీఆర్ రోడ్డు లో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం రీచ్ రోడ్డు ప్రారంబించిన తదుపరి గన్నవరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజల నుండి వినతులు స్వీకరించి వాటిపరిష్కారానికై అధికారులతో ఫోన్లో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్న, మండల పరిషత్ ఉపాధ్యక్షులు కొమ్మరాజు సుధీర్, ఎంపీటీసీ లు మద్దినేని వెంకటేశ్వరరావు, పడమట రంగారావు, గ్రామ సర్పంచ్ నిడమర్తి సౌజన్య, కృష్ణ మిల్క్ యూనియన్ డైరెక్టర్ పాలడుగు నాని, గ్రామ పార్టీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్, జాస్తి ఫణి, దేవినేని సులోచన, పంచాయతీరాజ్ డిఈ, ఏఈ తదితరులు పాల్గొన్నారు

## అంతర్జాతీయ సదస్సులో పాల్గొన్న ఇబ్రహీంపట్నం యువకుడు

- టర్కీలో ఫ్రాగ్ బ్లాస్టింగ్ సింపో సిజంలో డాక్టర్ చంద్రహాస్ ప్రజెంటేషన్
- 2028 కెనడాలో జరిగే సింపో సిజంకు ఎంపిక




**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 11 (వార్తా ప్రభ ప్రతినిధి):** టర్కీలో ఈ నెల 10న జరిగిన ఫ్రాగ్ బ్లాస్టింగ్ సింపో సిజంలో సౌత్ ఇండియా తరపున ఏకైక వ్యక్తిగా ఇబ్రహీంపట్నం రాయల్ బ్రిలియంట్స్ హైస్కూల్ అధినేత నిడుముక్కల శివశంకర రావు కుమారుడు డాక్టర్ చంద్రహాస్ హాజరై అత్యుత్తమ ప్రెజెంటేషన్ ఇచ్చారు. దీనికి మెచ్చి 2028లో కెనడాలో జరగనున్న ఫ్రాగ్ బ్లాస్టింగ్ సింపో సిజంకు ఎంపిక చేశారు. 1893లో ప్రారంభమైన ఫ్రాగ్ బ్లాస్టింగ్ సిరీస్ ప్రతి మూడేళ్లకు ఒకసారి నిర్వహిస్తున్నారు. ఒలింపిక్స్ మాదిరిగా వివిధ దేశాల్లో జరుగుతున్న ఈ ఫ్రాగ్ బ్లాస్టింగ్ సింపో సిజంను గత ఏడాది చైనాలో నిర్వహించగా ఈ ఏడాది టర్కీ ఆతిథ్యమిచ్చింది. దీనికి 36 దేశాల నుంచి హాజరయ్యారు. చాంబర్ ఆఫ్ మైనింగ్ అసోసియేషన్ అండ్ ఇస్తాంబుల్ యూనివర్సిటీ కలిసి నిర్వహించగా చంద్రహాస్ ను ఆహ్వానించి ప్రజెంటేషన్ ఇప్పించారు. కెనడాలో జరగనున్న ఫ్రాగ్ బ్లాస్టింగ్ సింపో సిజంకు ఎంపికైన డాక్టర్ చంద్రహాస్ ను పలువురు అభినందించారు.

## యాలా పాల లేకుండా విచ్చలవిడిగా అమ్ముతున్న బార్లు పై చర్యలు తీసుకోండి

ఏ ఐ వై ఎఫ్ నగర కార్యదర్శి లంకా గోవిందరాజులు డిమాండ్



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 11 :(వార్తా ప్రభ ప్రతినిధి)** యాలా పాలా లేకుండా జరుగుతున్న మద్యం అమ్మకాలు నియంత్రణ చేయాలని విజయవాడ మారుతి నగర్ లో ఉన్న ఎక్సైజ్ శాఖ జిల్లా కార్యాలయంలో ఇన్చార్జి సూపరిండెంట్ రంశివ కి కలిసి ఏ ఐ వై ఎఫ్ ప్రతినిధులు శుక్రవారం వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ నగర్ కార్యదర్శి లంకా గోవిందరాజులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బార్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ముఖ్యంగా విజయవాడ నగరంలో సింగ్ నగర్, ప్రకాష్ నగర్, కండ్రిక, హనుమాన్ పేట, కృష్ణలంక, గాంధీనగర్, చలసాని నగర్, కబేలా, భవానిపురం, మిల్క్ ఫ్యాక్టరీ, చిట్టినగర్ ప్రాంతాలలో అనేక బార్లు రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రాత్రి మూడు గంటల వరకు తెల్లవారుజామున 5 గంటల నుండి అక్రమంగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రోజువారీ కార్మికులు, రవాణా రంగానికి సంబంధించిన లారీ డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు ఎక్కువగా సంచరించే ప్రాంతాలలో మద్యం అమ్మకాలు బ్లాక్ లో నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టడమే కాకుండా ప్రజల ఆరోగ్యాన్ని హరింప చేయడంతో పాటు పలు ప్రమాదాలకు కేంద్రబిందువుగా మారుతున్నాయని గోవింద రాజులు వివరించారు.ఇప్పటికే పలుమార్లు ఏఐవైఎఫ్ గా విజయవాడ నగరంలో ఉన్నటువంటి పలువురు అధికారులకు ఫిర్యాదు చేసిన స్పందించినటువంటి పరిస్థితులు., ఇబ్రహీంపట్నం, నందిగామ, తిరువూరు, మైలవరం, జగ్గయ్యపేట నియోజకవర్గాలలో రాష్ట్ర సరిహద్దు గ్రామాలలో బెల్టు షాపుల నిర్వహణ విపరీతంగా సాగుతున్నది. సమయంతో సంబంధం లేకుండా అక్రమ మద్యం అమ్మకాలు చేపట్టడం ద్వారా అనేక ప్రమాదాలతో పాటు గ్రామాలలో గొడవలు చోటు చేసుకున్న పరిస్థితులు నెలకొన్నాయి.తమరు చొరవ తీసుకొని బార్ల యజమానులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్మకాలు జరిగేలా చర్యలు చేపట్టాలని ప్రజల ఆరోగ్యాన్ని, ప్రాణాలను ,శాంతి భద్రతలను కాపాడాలని అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ ఎన్టీఆర్ జిల్లా సమితి %ద% విజయవాడ నగర సమితి గా కోరుచున్నామన్నారు. వినతి పత్రం ఇచ్చిన బృందంలో నాయకులు సింగంశెట్టి మోహన్ ప్రసాద్, ఐ ఆంజనేయులు, బర్రె రాజా, గంట మమత, నరేష్, షైనీ, తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన నాగారం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి,



**కీసర, నాగారం, ఏప్రిల్ 11:(వార్తా ప్రభ)** నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డు రాజ్ సుఖ్ నగర్ కాలనీ రోడ్ నెంబర్ 8 లో సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన నాగారం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి ఈ సందర్భంగా ముప్పు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, సహకారంతో ఈ రోడ్డు పనులు ప్రారంభం జరిగిందని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్లు మాదిరెడ్డి వెంకటరెడ్డి అన్నం రాజ్ సుమిత్ర సురేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సతీష్ గౌడ్, కాలనీ అధ్యక్షులు దాసు, జనరల్ సెక్రెటరీ వేణుగోపాల్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాబు రావు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సాక్షిత తెలుగు దినపత్రిక ఎడిటర్ బీరం తేజో మూర్తి జన్మదిన వేడుకలు



**కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** సాక్షిత తెలుగు దినపత్రిక ఎడిటర్ బీరం తేజో మూర్తి జన్మదినం సందర్భంగా శుక్రవారం కుత్బుల్లాపూర్ సూరారం లోని తన కార్యాలయంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ జన్మ దిన వేడుకలకు తోటి విలేకరులు హాజరై ఆయనను శాలువతో సత్కరించి కేక్ కట్ చేయించారు. అనంతరం జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తేజో మూర్తి మాట్లాడుతూ... తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ జన్మదిన కార్యక్రమంలో విలేకరులు పర్వేజ్ అహ్మద్, అజ్మత్ అలీ, బైరోజు మహేష్, సోహెల్ అహ్మద్, ఎండి నిజాం పాల్గొన్నారు.

## శ్రీ మణికంఠ సేవసమితి ఆధ్వర్యంలో ఘనంగా అయ్యప్ప స్వామి మహ పడి పూజ



**కూకట్ పల్లి,ఏప్రిల్ 11(వార్తాప్రభ) :**శ్రీ మణికంఠ సేవసమితి ఆధ్వర్యంలో పంచమి కాలనీ శ్రీ మరెమ్మ తల్లి దేవాలయంలో నిర్వహించిన ఉత్తర ణక్షత్ర పర్వదినాన్ని పురస్కరిం చుకొని శ్రీ అయ్యప్పస్వామి జన్మదిన సందర్భంగా మహపడిపూజ నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధులుగా శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్, కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్, సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వర రావు,జిల్లా గణేష్, నర్సింగ్ యాదవ్,సతీష్ రావు, తెల్ల హరికృష్ణ,వి.రాకేష్, వి.కళ్యాణ్, సురభి రమేష్ రావు,మంజుల యాదవ్,అమూల్య తదితరులు అయ్యప్ప స్వామిని దర్శించుకొని తదనంతరం పల్లకి ఊరేగింపు మరియు అన్నదాన కార్యక్రమంలో పాల్గొనడం జరిగినది. ఈ కార్యక్రమంలో శ్రీ మణికంఠ సేవసమితి కమిటీ సభ్యులు, శ్రీ మరెమ్మ తల్లి దేవాలయ కమిటీ అభ్యులు, మహిళలు, భక్తులు, అధికసంఖ్యలో పాల్గోని స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకర్ణించం జరిగినది.

## జర్నలిస్టుల పక్షాన పోరాడే సంఘం టీడబ్ల్యూజేఎఫ్

-మేం పాలకుల పక్షం కాదు..పాత్రికేయుల పక్షమే -రాష్ట్రవ్యాప్తంగా నెంబర్ వన్ స్థానంలో నిలవాలి -రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య,ప్రధాన కార్యదర్శి బసవపున్నయ్య -రంగారెడ్డి జిల్లాలో భారీగా సభ్యత్వ నమోదు -ఫెడరేషన్ లో చేరిన వివిధ యూనియన్ల నేతలు





**కుత్బుల్లాపూర్ ఏప్రిల్ 11)వార్తా ప్రభ) :** రాష్ట్రంలో జర్నలిస్టుల పక్షాన పోరాడే ఏకైక సంఘం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) అని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య అన్నారు. జర్నలిస్టులకు అండగా ఉండేందుకు ప్రత్యామ్నాయ ట్రేడ్ యూనియన్ గా ఏర్పడిన ఫెడరేషన్ జర్నలిస్టుల ఆదరణతో నెంబర్ వన్ యూనియన్ గా బలపడిందని అన్నారు. రాష్ట్రవ్యాపితంగా జరుగుతున్న ఫెడరేషన్ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి జర్నలిస్టుల నుంచి విశేష స్పందన లభిస్తుందని అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడలో జరిగిన టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమం, వివిధ యూనియన్ల నేతల చేరికల కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో జర్నలిస్టుల పరిస్థితులు మరింత దారుణంగా మారుతున్నాయని, ఒకవైపు యాజమాన్యాలు,ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం లేదని, మరోవైపు దాడులు, అవమానాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులు శిక్షణతో కూడిన వృత్తినైపుణ్యతను పెంపొందించుకొని విధినిర్వహణలో సమర్థవంతంగా ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్రంలోని కొన్ని ప్రధాన జర్నలిస్టు యూనియన్లు జర్నలిస్టుల పక్షం కాకుండా పాలకుల పక్షాన నిలిచి జర్నలిస్టుల సమస్యలను విస్మరించాయని విమర్శించారు. టీడబ్ల్యూజేఎఫ్ సంఘం పాలకుల పక్షాన కాకుండా కేవలం పాత్రికేయుల పక్షాన నిలిచి సమస్యలపై పోరాడుతుందని మామిడి సోమయ్య స్పష్టం చేశారు. ఈ సంఘంలో ఉన్న పాత్రికేయులు కూడా ప్రజల పక్షం ఉండాలని, ప్రజల సమస్యలపై స్పందించాలని కోరారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బసవపున్నయ్య మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వాలు జర్నలిస్టులను పూర్తిగా విస్మరించాయని, గత బీఆర్ ఎస్ ప్రభుత్వం జర్నలిస్టులకు తీరని అన్యాయం చేసిందని అన్నారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు రాకపోవడానికి గత ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు, అక్రెడిటేషన్ కార్డులు, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజు తగ్గింపు, ఇండ్ల స్థలాలు వంటి సమస్యలు పరిష్కరించాల్సి వుందని అన్నారు. హక్కుల సాధన కోసం రాబోయే రోజుల్లో ఫెడరేషన్ నిర్వహించబోయే ఉద్యమాల్లో జర్నలిస్టులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎఫ్ డబ్ల్యూజే కార్యదర్శి పులిపలుపుల ఆనందం, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు దేవేందర్, ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్, కార్యదర్శి జగదీష్, జిల్లా కార్యదర్శి సైదులు తదితరులు పాల్గొన్నారు.

**టీడబ్ల్యూజేఎఫ్ లో చేరిన 200 మంది జర్నలిస్టులు**రంగారెడ్డి జిల్లాకు చెందిన తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీఎస్ యూడబ్ల్యూజే-ఐజేయూ అనుబంధం), తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీయూడబ్ల్యూజే-143) యూనియన్ లకు చెందిన దాదాపు రెండు వందల మంది జర్నలిస్టులు టీడబ్ల్యూజేఎఫ్ లో చేరారు. సూర్య దినపత్రిక జిల్లా బ్యూరో రిపోర్టర్ గణేష్, వార్త జిల్లా బ్యూరో రఘుపతి, సాక్షి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ శ్రీశైలం, దిశ జిల్లా బ్యూరో సురేష్ తదితరులతో పాటు వివిధ పత్రికలకు చెందిన రెండు వందల మంది జర్నలిస్టులు ఆయా జర్నలిస్టు యూనియన్లకు రాజీనామా చేసి ఫెడరేషన్ లో చేరారు. వీరందరికి ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మామిడి సోమయ్య, బి.బసవపున్నయ్య సభ్యత్వం ఇచ్చి సంఘంలోకి ఆహ్వానించారు.

## మాజీ మంత్రి కొడాలి నాని త్వరగా కోలుకోవాలని అభిమానుల ప్రత్యేక పూజలు..

- శ్రీ గంగానమ్మ అమ్మవారికి 108 కొబ్బరికాయలు కొడుతూ -సారే సమర్పించిన అభిమానులు..



**గుడివాడ,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** మాజీమంత్రి కొడాలి నాని ఆరోగ్యం కుదుటపడి త్వరగా కోలుకుని ప్రజాసేవలో పునరంకితం కావాలని కోరుతూ అభిమానులు మరియు వైఎస్ఆర్సిపి శ్రేణులు ఆధ్వర్యంలో పేద ఎరుకపాడులోని శ్రీ గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొడాలి నాని అభిమానులు వన్నెంరెడ్డి దినేష్, అడపా హర్షల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు మరియు పార్టీ శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు. ముందుగా అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించి సారెను సమర్పించిన నాయకులు, 108 కొబ్బరికాయలు కొడుతూ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి నాయకులు మండలి హనుమంతరావు, పాలేటి చంటి తదితర నాయకులు మీడియాతో మాట్లాడారు భగవంతుడి దీవెనలు, గుడివాడ ప్రజల ఆశీస్సులతో కొడాలి నాని సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకొని తిరిగి ప్రజా జీవితంలోకి వస్తారని ఆకాంక్షించారు. అపర భగీరథుడిగా పేరుగాంచిన కొడాలి నాని, దశాబ్దాలుగా ప్రజలకు చేసిన ఎనలేని సేవా కార్యక్రమాలే ఆయనకు శ్రీరామరక్షగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి సీనియర్ నాయకులు కొంకితల ఆంజనేయ ప్రసాద్, అద్దేపల్లి పురుషోత్తం, అడపా పండు, సింహాద్రి రాంబాబు, బత్తుల మురళి, మెరుగుమాల ఉదయ్, పలువురు వైఎస్ఆర్సిపి నాయకులు, కొడాలి నాని అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## అణగారిన వర్గాల కోసం జీవితాన్ని ధారబోసిన మహనీయుడు జ్యోతిరావు పూలే -ఏపిఎస్‌డబ్ల్యుసి చైర్మన్ రావి

- గుడివాడ టిడిపి కార్యాలయంలో ఘనంగా జరిగిన పూలే 199వ జయంతి వేడుకలు.. పూలే చిత్రపటానికి నివాళులర్పించిన టిడిపి నాయకులు..





**గుడివాడ,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** అణగారిన వర్గాల కోసం జీవితాన్ని ధారబోసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వర రావు కొనియాడారు. ఏలూరు రోడ్డులోని టిడిపి కార్యాలయం (ప్రజా వేదిక)లో మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు మరియు టిడిపి నాయకులు పూలే చిత్రపటానికి నివాళులర్పించి.. జోహార్ జ్యోతిరావు పూలే అంటూ నినాదాలు చేశారు. సమాజంలో కులవ్యవస్థ నిర్మూలన, స్త్రీ,పురుషులకు సమాన హక్కుల కోసం ఎంతగానో పోరాడిన సామాజిక యోధుడు మహాత్మా జ్యోతిరావ్ పూలే అని టిడిపి నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, గుడివాడ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, టిడిపి నాయకులు వెనిగండ్ల రామకృష్ణ (నాని), చేకూరు జగన్ మోహన్ రావు, కంచర్ల సుధాకర్, సింగవరపు ప్రభాకర్, పొట్లూరి కృష్ణారావు, పెద్ది వీరభద్రరావు, కంచనపల్లి సుబ్రహ్మణ్యం, పోతురాజు, గొర్ల శ్రీలక్ష్మి, శైలజ, ఇమ్మానుయేలు, దేవేంద్రుడు, కోటా శ్రీను, లోయ వాసు, కోసూరి అనిల్ బాబు, ఆదినారాయణ, కాగిత శివశంకర్, పోలగాని కృష్ణయ్య, రాజశేఖర్, టిడిపి నాయకులు, తెలుగు మహిళలు, అనుబంధ విభాగాల నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

**బిజెపి పట్టణ అధ్యక్షుడు ఆర్.కె ఆధ్వర్యంలో.. :** స్థానిక సత్యనారాయణపురం బిజెపి పార్టీ ఆఫీసులో పట్టణ అధ్యక్షుడు మాచర్ల రామకృష్ణ (ఆర్.కె) ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్.కె. మాట్లాడుతూ అణగారిన వర్గాల కోసం జీవితాన్ని ధారబోసిన మహనీయుడని, జ్యోతిరావు పూలే స్ఫూర్తితో ప్రజలకు దగ్గరగా ఉంటూ సామాజిక సేవ చేసుకుంటూ భారతీయ జనతా పార్టీని అభివృద్ధి చేసుకుంటూ ముందుకు వెళతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా కన్వీనర్ అంగడాల సతీష్ యాదవ్, నాయకులు ఎర్రపోతు అర్జున్ రావు, ఎస్సీ మోర్చా అధ్యక్షులు చిన్న, గానుగుల రాజా, పట్టణ మహిళా అధ్యక్షురాలు బోనం గోపిక, కిరణ్, రీటా, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అన్నదాతలను పట్టించుకోని అధికారులు





**కంకిపాడు,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** రైతు శ్రేయస్సు, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని, రైతు సమస్యలు, కష్టాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ప్రసంగాలు చేస్తున్న, అధికారులు నిమ్మకు నిరీత్తున్నట్లు వ్యవహరించడం వల్ల క్షేత్రస్థాయిలో రైతులకు న్యాయం జరగటం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వివరాల్లోకి వెళితే మండలంలోని ఈడుపుగల్లు, పునాదిపాడు, ఉప్పలూరు, కోలవెన్ను, గొడవర్రు వివిధ గ్రామాల్లో సుమారు 5000 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. సాగు చేసిన రైతులంతా దాదాపు కౌలు రైతులు, కౌలు రైతులకు రెండో పంటే ఆదాయం ఎన్నో ఆటుపోటులు ఎదుర్కొని సాగుచేసిన కౌలు రైతులకు దళారుల ఆధిపత్యంతో గిట్టుబాటు ధర రాక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ మార్చి 24వ తేదీన కంకిపాడు తహసిల్దార్ కార్యాలయంలో తాసిల్దార్ కి వివిధ గ్రామాలకు చెందిన రైతులు కౌలు రైతులు పండించిన వరి పంటను సొసైటీల ద్వారా ప్రభుత్వం కొనుగోలు చేయాలని సంబంధిత శాఖలకు విజ్ఞప్తి చేయాలని అర్జీని అందజేశారు. ఈ అర్జీకి సివిల్ సప్లై అధికారులు స్పందించి 2024 - 25 రబి పంట కాలమునకు సంబంధించిన ధాన్యము కొనుగోలును రైతు సేవా కేంద్రం ద్వారా ఈ క్రాప్ మరియు ఈ కేవైసీ లో నమోదైన రైతులు యొక్క ధాన్యమును కొనుగోలు చేయుటకు ప్రభుత్వం వారు ఉత్తరాలు జారీ చేయడం జరిగింది అని రైతులు ధాన్యం కొనుగోలుకు అధికారులు తగిన ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరణ ఇచ్చారు. సివిల్ సప్లై అధికారులు వివరణ ఇచ్చి రెండు వారాలు గడిచిన అధికారులు కొనుగోలు ప్రక్రియ ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్దిరోజుల క్రితం ఈదురుగాలి,వర్షం పడటంతో కోతకొచ్చిన పంట నేలకు ఒరిగింది, రాబోయే రోజుల్లో వర్ష సూచన ఉందని వాతావరణ శాఖ వారు హెచ్చరికలు జారీ చేస్తుంటే ఎప్పుడు ధాన్యం కొనుగోలు చేస్తారని పలుమార్లు అధికారులు అడిగిన నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడంతో రైతులు లబోదిబోమంటున్నారు. పక్క జిల్లాలలో కొనుగోలు కేంద్రాల ద్వారా పంటను కొనుగోలు చేస్తుంటే, మండలంలో అధికారులు ఏమీ పట్టనట్టు కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయకపోవడం ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు????. ఇప్పటికైనా స్థానిక శాసనసభ్యులు,సంబంధిత ప్రభుత్వ అధికారులు చొరవ తీసుకొని రైతులను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిరావు పూలే-జడ రాంబాబు

- జి.కొండూరు లో ఘనంగా మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు
- సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన జి. కొండూరు వైఎస్ఆర్సిపి మండల అధ్యక్షుడు .....జడ రాంబాబు



**జి.కొండూరు,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** అణగారిన వర్గాల ఆశాజ్యోతి, సంఘ సంస్కర్త , బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన మహనీయుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జి.కొండూరు మండల అధ్యక్షులు జడ రాంబాబు అన్నారు.స్థానిక పులివాగు వంతెన సమీపంలోని మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వై యస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి చనమోలు వెంకట్రావు విగ్రహాల వద్ద వైసీపీ మండలం పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా మహాత్మ జ్యోతి రావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా జడ రాంబాబు పార్టీ నాయకులతో కలిసి జ్యోతి రావు పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం జడ రాంబాబు మహాత్మ జ్యోతి రావు పూలే చేసిన సేవలు కొనియాడారు. అంటరానితనాన్ని రూపుమాపి విద్య వైద్యం ను అందించుటకు ఎంతగానో కృషి చేశారని, అందుకే ఆయనను మహాత్ముడు అని కొనియాడారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మండల అరుణ ,గ్రామపార్టీ అధ్యక్షుడు వేములకొండ విష్ణు,వైస్ ఎంపీపీ పుప్పాల సుబ్బారావు,కె డి సి సి బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ వేములకొండ రాంబాబు , తెల్లదేవరపాడు గ్రామ సర్పంచ్ ఉమ్మడి ప్రసాద్, కుంటముక్కల గ్రామ సర్పంచ్ వంగూరి కుమారి, చెవుటూరు గ్రామ సర్పంచ్ పిన్నిబోయిన శ్రీదేవి, మాజీ ఎంపిటిసి సభ్యులు వేములకొండ సాంబయ్య , వైసీపీ నాయకులు బట్టపర్తి శేఖర్ బాబు, దొడ్డ విష్ణు మల్లేశ్వరరావు ,మంద మధు, మంద కాంతయ్య, పేయ్యల ప్రతాప్,పంగిడియ్య, పసుపులేటి రమేష్, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## రాజ్యాధికార దిశగా బిసిలందరం పోరాడుదాం -బి.సి. చైతన్య సంక్షేమ సంఘం

- బి.సి. చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి రావులకొల్లు వెంకట మల్లేశ్వరరావు, బిసి సంఘంల ఆధ్వర్యంలో ఘనంగా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమం..



**గుడివాడ,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** చట్టసభల్లో బి.సి.లకు 50శాతం రాజ్యాధికారం వచ్చేవిధంగా బి.సి.లందరం కలసి పోరాడదమని రాష్ట్ర బి.సి చైతన్య సంక్షేమ సంఘం అధ్యక్షురాలు వేముల బేబిరాణి అన్నారు. శుక్రవారం జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా బి.సి. చైతన్య సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకొల్లు మల్లేశ్వరరావు, బి.సి. సంఘంల ఆధ్వర్యంలో మెయిన్ రోడ్‌లోని జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బేబిరాణి మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సం॥లు గడిచినా రాజకీయ పార్టీలు నేటికి నిష్పత్తి ప్రకారం కమిటీల్లో సీట్లు కేటాయించలేదని ఆరోపించారు. ఈ క్రమంలో బి.సిలు ఐక్యంగా ఉండి మన హక్కుల కోసం పొరాడదామనీ పిలుపునిచ్చారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లేశ్వరరావు మాట్లాడుతూ పార్టీల కతీతంగా నాయకుల అందరూ ఈ కార్యక్రమానికి పాల్గొనడం హర్షణీయమన్నారు. గుడివాడ నియోజకవర్గంలో బి.సి.లను ఓటుబ్యాంకుగా వాడుకుంటున్నారనీ విమర్శించారు. భవిష్యత్తులో బి.సి.లకు రావలసిన పదవులను పోరాడి తెచ్చుకుందామనీ పిలుపునిచ్చారు. అనంతరం కొలుసు రాజా, ఎస్‌సి సంఘం నాయకులు జయరాజు, సైమన్, బి.సి.నాయకులు బండారు రాధాకృష్ణ, యార్లగడ్డ గోవర్ధన్ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అగస్తి ఆదివిష్ణు, బోయిన సోమశేఖర్, నైనవరపు శేషు, మందాడి శ్రీనివాస్, చింతలూరి సత్యనారాయణ, డా॥ శ్యామ్, పోతురాజు దుర్గాప్రసాదు, ఎంఆర్ మోహనరావు, గులిపల్లి ప్రభాకర్, లోయ రాధాకృష్ణ, వీర్ల వెంకటేశ్వరరావు, కొలుసు కృష్ణారావు, గండికాడ నాగరాజు, కలవగుండ శ్రీనివాసరావు, బి.నగేష్, ఓంకార్, సబ్బాని రంగారావు, బ్రాహ్మజీ వంగపండు, పీత సుబ్బారావు, తమ్మినేని రామోహనరావు తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన ఇంటి పన్నులు తగ్గించుకుంటే ప్రజా ఆందోళన

- కమిషనర్ కు వినతిపత్రం అందించిన జనసేన సమన్వయకర్త చలమలశెట్టి



**హనుమాన్ జంక్షన్,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** బాపులపాడు మండల కేంద్రమైన బాపులపాడు గ్రామ పంచాయతీలో గతంలో ఇంటి పన్నులు భారీగా పెంచడం జరిగింది. వీటిపై గత నెలలో బాపులపాడు గ్రామస్తులతో పాటు గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు ఆధ్వర్యంలో పంచాయతీ అధికారులకు వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఇంటి పన్ను ల పెంపుదలపై విచారణ జరిపి పెరిగిన ఇంటి పన్నులను సవరించవలసిందిగా చలమలశెట్టి రమేష్ బాబు ఆధ్వర్యంలో బాపులపాడు గ్రామస్తులు పంచాయతీరాజ్ కమిషనర్ కి శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా కార్యవర్గం సభ్యులు చిమటా రవివర్మ,బాపులపాడు మండల జనసేన పార్టీ అధ్యక్షులు వడ్డి శివ నాగేశ్వర రావు, హనుమాన్ జంక్షన్ టౌన్ జనసేన పార్టీ ప్రెసిడెంట్ షేక్ అహ్మద్, రామినేని రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ మృతిపై చట్ట ప్రకారం దర్యాప్తు చేయమన్నాం.. అదేమైనా తప్పా!

- ఏఐసిసి జాతీయ అధ్యక్షుడు జాన్ బెన్ని లింగం

> 15 ఎళ్ళుగా క్రైస్తవుల సమస్యలపై తెలుగు రాష్ట్రాల్లో నేను పోరాటం చేస్తున్నాను.. పాస్టర్ ప్రవీణ్ అనుమానాస్పద మరణంపై తాను.. మత విద్వేషాలు రెచ్చగొట్టినట్లు నిరూపిస్తే నా తల నేనే నరుకుకుంటాననీ బహిరంగంగా చెబుతున్న.. ఓ చానల్ తో నేను మాట్లాడిన వీడియోలను మార్ఫింగ్ చేశారు..



**గుడివాడ,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** స్థానిక రాజేంద్రనగర్ –అంబేద్కర్ భవన్లో అసోసియేషన్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసిసి) జాతీయ అధ్యక్షుడు జాన్ బెన్ని లింగం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ క్రమంలో జాన్ బెన్ని మాట్లాడుతూ గత 29 ఏళ్లుగా పాస్టర్ గా దైవ సేవ చేస్తున్నాను.. ముఖ్యంగా ఏపీ తెలంగాణ రాష్ట్రాల్లో క్రైస్తవులపై జరుగుతున్న దాడులపై 15ఏళ్లుగా పోరాడుతున్నాను.. అలాగే క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నానని తెలుపుతూ ఈ తన పోరాటంలో భాగంగానే పాస్టర్ పగడాల ప్రవీణ్ అనుమానాస్పద మృతిపై మాట్లాడాని అన్నారు. ఆయన మరణించిన ఘటన ప్రాంతంలోని దృశ్యాలు చూసి హాస్పిటల్ కి వెళ్లాను.. అప్పటికే వేలాది మంది నిరసన వ్యక్తం చేస్తున్నారు. రక్తపు మడుగులో ఉన్న ప్రవీణ్ భౌతిక గాయాన్ని చూసి నా గుండె చలించింది.. ఇదంతా చూసి ఆవేదనతో ఉన్న నేను ఒక మీడియా ఛానెల్ తో మాట్లాడాను.. నేను మార్చి26వ తారీఖున మాట్లాడిన వీడియోలను కొన్ని మీడియా ఛానల్స్ వక్రీకరించి.. ఏప్రిల్ రెండో తేదీ తర్వాత ప్రసారం చేశాయి. ఇదంతా కుట్రపూరితంగానే జరిగింది. ఎంత రెచ్చగొట్టినా మేము చట్టానికి లోబడి, చట్టాన్ని గౌరవించే పనిచేస్తున్నాం.. కానీ నేను దళితుడని అన్న కారణంతోనే తన మాటలను వక్రీకరించి.. తనపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఏ తప్పు చేయని మమ్మల్ని అరెస్టు చేస్తున్నారు.. జైల్లోకి పంపుతున్నారు. సిట్ దర్యాప్తులో నేను వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని చెప్పాను. ముఖ్యంగా నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగాలని కోరాను. అంతేతప్ప నేనేదో ఆవేశంతో మాట్లాడాను అని సిట్ ముందు మాట్లాడినట్లు.. కొన్ని పత్రికల్లో కథనాలు వచ్చాయి. తనపై తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్న వారిపై గుడ్లవల్లేరు పోలీసులకు ఫిర్యాదు చేశాను. ఆ రోజు మత విద్వేషాలు రెచ్చగొట్టినట్లు నిరూపిస్తే నా తల నేనే నరుకుకుంటాను. తొలుత సిట్ విచారణలో రికార్డు చేసిన వీడియోని ఇవ్వాల్సిందిగా ఆర్టిఐ ద్వారా కొరతాను అని జాన్ బెన్ని తెలియజేశారు. ఈ సమావేశంలో అఖిల భారత మాల సంఘాల జేఏసీ గౌరవ అధ్యక్షులు పొంగలేటి జయరాజు, ఏఐసీసీ అడ్వైజర్ కృపాకర్, పట్టణ అధ్యక్షుడు తంటేపూడి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ చైర్మన్, వైస్ చైర్మన్ ను సన్మానించిన కూటమి నాయకులు



**కంకిపాడు,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** మండలంలోని కోలవెన్ను గ్రామంలో శుక్రవారం మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మల్లంపల్లి కళ్యాణి నివాసం వద్ద వైస్ చైర్మన్ కు ,చైర్మన్ ధనయ్య కు కోలవెన్ను గ్రామంలో కూటమి నాయకులు రైతులు శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు తెలుగుదేశం పార్టీ ఒక మహిళగా బిసి మహిళను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆధ్వర్యంలో మల్లంపల్లి కళ్యాణి కి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ గా ప్రకటించినందుకు ప్రత్యేకంగా ఎమ్మెల్యే కి కోలవెన్ను గ్రామస్తులు రైతలు, కూటమి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. రైతులందరూ మినుముకు గిట్టుబాటు ధర కల్పించాలని చైర్మన్ ధనయ్య దృష్టికి తీసుకువెళ్లారు. దీనికైన ధనయ్య స్పందిస్తూ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కంకిపాడు మండల పార్టీ మాజీ అధ్యక్షులు కొండవీటి శివయ్య, ఉప్పులూరు హాస్పటల్ మాజీ చైర్మన్ పడవల మధుసూదన్ రావు, గ్రామ కూటమి నాయకులు బొబ్బ శ్రీను, వల్లభనేని రాంబాబు, కంచర్ల శేషగిరి, తట్టకూరి సురేష్, జోగ ఆదినారాయణ ఉప్పలపాటి శివ, నాగమల్లేశ్వరరావు, భోగా సోములు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహాత్మా జ్యోతి రావు పూలె 199 వ జయంతి వేడుకలు



**పెనుగంచిప్రోలు,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు మండల కేంద్రంలోని తూర్పు బజార్ వద్ద ఉన్న మహాత్మా జ్యోతి రావు పూలే 199 వ జయంతి వేడుకలు రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా రాష్ట్ర ఎంపీపిల సంఘం అధ్యక్షులు, మండల ఎంపీపీ మార్కాపూడి గాంధీ హాజరైన్నారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ మహాత్మ జ్యోతి రావు పూలె మన దేశం కోసం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, కుల వివక్ష లేకుండా చెయ్యడానికి పోరాడిన మహొన్నత మహనీయుడు మహాత్మా జ్యోతి రావు పూలె అని తెలిపారు.ఈ కార్యక్రమం లో మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు కాకాని హరి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ తమ్మిశెట్టి సోమయ్య, నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులు మండెం దాసు , వైసీపీ సోషల్ మీడియా కన్వినర్ నల్లబోతుల వెంకటేష్,ఎంపీటీసీ సభ్యులు చాట్ల సుశీల , అనిగండ్లపాడు వైసీపీ నాయకులు వున్నం శ్రీనివాస్ , తిరుపతమ్మ అమ్మవారి దేవస్తాన ట్రస్ట్ బోర్డు మెంబర్ గడాటి పెద్దోడు ,బిసి సెల్ నాయకులు మల్లెబోయిన సైదులు, మండల ఎస్సి సెల్ నాయకులు బొడ్డు రవి,, బిసి నాయకులు చేని రాంబాబు ,శనగపాడు ఎంపీటీసీ కిసర లోకేష్ , ముండ్లపాడు గ్రామ పార్టీ అధ్యక్షులు నరాల మధుసూదన్ రెడ్డి ,8 వార్డ్ సభ్యులు గుజ్జర్లపూడి రాంబాయి,ఉదయ్ బాబు, ఎస్సి నాయకులు తుమ్మల రమణ, పొన్నవరం ఎస్సి నాయకులు సురేష్ ,కృష్ణ , దేవదాసు , పెనుగంచిప్రోలు యూత్ నాయకులు గజేం నాగేంద్ర , వడిదేల సాయి ,వేముల గోవర్ధన్ ,సురేష్ ,బీమవరపు సాయి,తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## బిసి లకు 52%రిజర్వేషన్ కల్పించాలి

- బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా
- దద్దరిల్లిన కలెక్టరేట్ కలెక్టరుకు వినతిపత్రం అందజేత



**కాకినాడ,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** బహు జన్ సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల ప్రకారం కాకినాడ జిల్లాల బిసిలకు చట్టసభల్లో 52 శాతం రిజర్వేషన్ కల్పించాలంటూ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు ఎం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సంఘాలను, నాయకులను కలుపుకొని బీసీ సమర భేరి పేరుతో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు పంపన రామకృష్ణ బాధ్యత తీసుకోగా బిసి సంఘ నాయకులు చొల్లంగి వేణుగోపాల్, బహుజన నాయకులు అయినవిల్లి నారాయణ గౌడ్, 93 బిసి కులాల అధ్యక్షులు మాకినీడి భాస్కర్ గణేష్, బీసీ సంఘ నాయకులు పప్పు దుర్గా రమేష్,సామాజిక న్యాయ సాధన సమితి అధ్యక్షులు కోరుకొండ భానుమతి,దళిత సంఘ నాయకులు పండు అశోక్ కుమార్, తోటి చెంగల్ రావు, బహుజన్ సమాజ్ పార్టీ కాకినాడ జిల్లా కమిటీ ముఖ్య పాత్ర పోషించగా అన్ని నియోజకవర్గాల ఇన్చార్జిలు అధ్యక్షులు ఆయ నియోజకవర్గాల కార్యకర్తలు నాయకులతో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా ఇన్చార్జి సబ్బరపు అప్పారావు, కాకినాడ జిల్లా జనరల్ సెక్రెటరీ కండవల్లి లోవరాజు, జిల్లా కన్వీనర్ ప్రత్తిపాటి బుల్లి రాజు, జిల్లా ట్రెజరర్ సాధనాల రాజు, ప్రత్తిపాడు నియోజకవర్గ అధ్యక్షులు అపురూప్, కాకినాడ సిటీ అధ్యక్షులు బుంగ చక్రవర్తి,కాకినాడ జిల్లాలోని ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలి-పి.జమలయ్య

● జి.కొండూరులో తహశీల్దార్ కు వినతిపత్రం అందజేసిన కౌలు రైతుల సంఘం నేతలు



**జి.కొండూరు,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** ధాన్యం కొనుగోలులో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలను అరికట్టాలని పి.జమలయ్య ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శుక్రవారం ఆయన ఎన్టీఆర్ జిల్లా కౌలురైతుల సంఘం అధ్యక్షుడు బుడ్డి రమేష్,రైతులు చెరుకూరి కుటుంబరావు, బుర్ర వెంకటేశ్వరరావు తదితరులతో కలిసి జి.కొండూరు తహశీల్దార్ కార్యాలయంలో తహశీ ల్దార్ సిహెచ్. వెంకటేశ్వర్లు కు వినతి పత్రం అందజే శారు.అనంతరం జమలయ్య మాట్లాడుతూ మద్దతు ధరలకే రబిలో పండిన ధాన్యం కొనుగోలు చేయాలని, ధర నిర్ణయంలో మిల్లర్ల అక్రమాలను ప్రభుత్వం అరికట్టాలన్నారు.కవులూరు గ్రామంలో గత 15 రోజుల క్రితం వరి పంటకోసి ధాన్యం ఆరబెట్టి కొనుగోలు కేంద్రం తీసుకెళ్తే రేపు ,మాపు అని రైతులను మిల్లర్లు ఇబ్బంది పెడుతున్నారని అన్నారు.17 శాతం లోపు తేమశాతం ఉన్నప్పటికీ కొనుగోలు చేయడం లేదనీ, పైగా మిల్లర్లు ధర నిర్ణయించి తరువాతే కొనుగోలు చేస్తామని కొనుగోలు కేంద్రంలో అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు.వాతావరణంలో వస్తున్న మార్పులను చూసి ధాన్యం తడిసిపోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రబి సీజన్లో ధాన్యాన్ని ఆరపెట్టుకోవటానికి, వర్షం వచ్చినప్పుడు తడవకుండా ఉండటానికి పట్టాలు కూడా ఇవ్వలేదని రైతుల ఆవేదనను జమలయ్య వెల్లడించారు.బుర్ర వెంకటేశ్వరావు అనే రైతు పంట కోసి ఎనిమిది రోజులు అయ్యిందని, రైతు చెరుకూరి కుటుంబరావు పంట కోసి ఆరబెట్టి తర్వాత 17 శాతం లోపే తేమశాతం వచ్చిందనీ అయినా కొనుగోలు చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు.75 కిలోల బస్తా ధాన్యాన్ని రూ.1740 కొనుగోలు చేయవలసి ఉండగా రూ.1500 లకు ఇస్తారా అని అడుగుతు న్నారని ఇది ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఇంతవరకు రైతులకు గన్నీ బ్యాగులు కూడా ఇవ్వలేదని, మిల్లర్లు తేమశాతం చూడాలని, ధర వాళ్లే నిర్ణయించాలని ,మిల్లర్లు ఎవరికి సంచులు ఇవ్వమంటే వాళ్ళకే ఇస్తామని మా చేతిలో ఏమి లేదని కొనుగోలు కేంద్రంలో ఉన్న అధికారులు చెప్పడం సిగ్గుచేటు అన్నారు. రైతన్న దిక్కుతోచని స్థితిలో ఉన్నారని వారిని ప్రభుత్వం ఆదుకోవాల ని విజ్ఞప్తి చేశారు.ప్రభుత్వ అధికారులు అయినప్పటికీ మిల్లర్లచేతిలో కీలుబొమ్మలుగా మారారని ఆరోపించారు.జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కొనుగోలు కేంద్రాలలో జరుగుతున్న అక్రమాలు అన్యాయాలను అరికట్టాలని, కొనుగోలు కేంద్రంలో మోసాలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఇదిలా ఉంటే కౌలు రైతు సంఘం నాయకుల విన్నపానికి స్పందించిన తహశీల్దార్ వెంకటేశ్వర్లు అధికారులతో మాట్లాడి శనివారం ఉదయం 10 గంటలకు కవులూరులోని కొనుగోలు కేంద్రానికి వెళ్ళి ధాన్యం అమ్ముకోవడం లో రైతుల పడుతున్న ఇబ్బందులను, ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

# నిరంతరం పోరాటయోధుడు పూలే

**అమలాపురం,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** బడుగు వర్గాల ఆశాజ్యోతి,అట్టడుగు వర్గాల అణచివేతకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడిన యోధుడు మహాత్మ జ్యోతిభా పూలే ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా నిలిచారని 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నా రు. శుక్రవారం జ్యోతిభా పూలే 199వ జయంతిని జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్ నందు ఘనంగా నిర్వహించారు. మహాత్మ జ్యోతిభా పూలే జయం తిని పురస్కరించుకుని పూలే చిత్ర పటానికి పూలమాలలు అలంక రించి పుష్పగుచ్చాలతో జిల్లా కలెక్టర్ నివాళుల ర్పించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల రక్షణ అభ్యున్నతికి నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్యక్ర మాలన్నింటికీ జ్యోతిభా పూలే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలే ఆదర్శాలన్నారు. సామా జిక రుగ్మతలను వెనుక బాటుతనాన్ని రూపు మాపే ఉద్యమానికి నాంది పలికిన జ్యోతి భా పూలే ఎందరో సంస్కర్తల కు మార్గదర్శకులుగా నిలిచారన్నారు. సమాజంలో జరుగుతున్న అకృ త్యాలను దోపిడీలను ఎదిరించి విద్య ద్వారా పీడిత వర్గాలలో ఆత్మ గౌరవం కోసం పోరాట జ్వాలను రగిలించారన్నా రు. కలిపిన కృషికి నిదర్శనంగా భారతీయ సామాజిక కార్యకర్తగా, కుల వ్యతిరేక సంఘ సంస్కర్త,రచయితగా అంటరానితనం కుల వ్యవస్థ నిర్మూలన, మహిళలు,అణగారిన కుల ప్రజలను విద్యావంతులను చేయడం ద్వారా భార్య సావిత్రిబాయి పూలే భారతదేశంలో స్త్రీల విద్యకు మార్గదర్శ కవులుగా నిలిచారన్నారు.రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్ర బోస్ ప్రసంగిస్తూ నానా జాతుల జీవన స్థితిగతు లు గమనసీలిగా కుట్ర జాతీయవాదాన్ని భగ్నం చేసిన రచన శీలిగా, విప్లవ



యోధుడిగా పేరుగాంచారన్నారు.అట్టడుగు కులాల ప్రజలకు సమాన హక్కులు కల్పించడం. అణ గారిన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయులని, సమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు అభివృద్ధి చెందకపోతే సమాజం అభివృద్ధి చెందదని పూలే భావించి స్త్రీలు విద్యావంతులు కావాలని నమ్మిన వ్యక్తన్నారు. జిల్లా జా యింట్ కలెక్టర్ టి నిశాంతి ప్రసంగిస్తూ మానవ హక్కులు ఉల్లంఘనకు గురికా కుండా సమ సమాజ స్థాపన కోసం అలుపెరు గని పోరాటం చేసిన మహాయోధుడన్నారు.ఈ కార్యక్రమంలో కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, కె.సూర్య నారాయణ రావు,జిల్లా స్థాయి అధికారులు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి పి ఎస్ రమేష్. తదితరులు పాల్గొ న్నారు.

# 13 న అన్వీ సూపర్ స్పెషాలిటీ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత మేఘా వైద్య శిబిరం



**హనుమాన్ జంక్షన్,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** రాజకీయాలకతీతంగా పేద వారికి తమ ట్రస్ట్ ద్వారా సేవలందిస్తామని స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్ అన్నారు. ఈ నెల 13 వ తేదీ ఆదివారం బాపులపాడు స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో అన్వీ సూపర్ స్పెషాలిటీ క్లినిక్ ఆధ్వర్యంలో జరగనున్న ఉచిత మేఘ వైద్య శిబిరం కు సంబంధించి బ్రోచర్ ను శుక్రవారం ఉదయం ట్రస్ట్ సలహాదారు డి.వి. రమణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం శ్రమించి సేవా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. డి.వి.రమణ మాట్లాడుతూ స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వీరమాచినేని సత్యప్రసాద్ శ్రీదేవి దంపతులు చేస్తున్న సేవా కార్యక్రమాలు అనిర్వచనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇంకా ట్రస్ట్ డైరెక్టర్ వీరమాచినేని శ్రీదేవి, బొమ్ములూరు సర్పంచ్ కాటూరి విజయభాస్కర్, దాసరి బెనర్జీ, కదగల శ్రీనివాసరావు, యనమదల సుధాకర్,వీరమాచినేని బుజ్జి, జాస్తి భూపతి, మేడేపూడి రామమోహన్ రావు,గొట్టాపు వాసు, అల్లంశెట్టి శ్రీనివాసరావు , నీలం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# పేద రోగులకు సీఎం.ఆర్.ఎఫ్ వరం : యార్లగడ్డ



**హనుమాన్ జంక్షన్,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పేద రోగులకు ముఖ్యమంత్రి సహాయనిధి వరమని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. బాపులపాడు గ్రామానికి చెందిన కొసరాజు విజయదుర్గకు రూ.70 వేలు,విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు గ్రామానికి చెందిన మేకల కరుణ బాబుకు రూ.4 లక్షల రూపాయలు ముఖ్యమంత్రి సహాయనిధినుండి మంజూరైన చెక్కులను గురువారం రాత్రి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యార్లగడ్డ వెంకట్రావు రోగుల కుటుంబ సభ్యులకి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు నియోజకవర్గ కేంద్రమైన గన్నవరంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని వంద పడకల వైద్యశాలగా అప్ గ్రేడ్ చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. ఈ ఆస్పత్రిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయడం ద్వారా గన్నవరం నియోజకవర్గం లోని పేద రోగులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని అన్నారు. నియోజకవర్గం లో వైద్యచికిత్స కు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న రోగులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సత్వరమే సాయం అందిస్తున్నట్లు వివరించారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్దే ధ్యేయంగా, ప్రజా సంక్షేమ లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఈ సందర్భంగా యార్లగడ్డ తెలిపారు.

## పూలే ఆశయాలను ముందుకు తీసుకెళదాం : డాక్టర్ చప్పిడి



**కాకినాడ,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలను ముందుకు తీసుకు వెళదామని ఆయన చరిత్రను పిల్లలు ప్రతి ఒక్కరూ చదవాలని అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ రాష్ట్ర శెట్టిబలిజ డెవలప్మెంట్ అండ్ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక పాత బస్టాండ్ వద్ద అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హాండ్స్ అధ్యక్షులు మద్ద వికాస్ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుక జరిగింది.కార్యక్రమానికి జిల్లా 106 గవర్నర్ పెంకే గోవిందరాజు ముఖ్యఅతిథిగా విచ్చేసి 18వ శతాబ్దంలోనే స్త్రీలకు మొట్టమొదటి పాఠశాల నేర్పరిచిన ఘనత ఆయనది అని చెప్పారు.విశిష్ట అతిధిగా సౌత్ మల్టిపుల్ కౌన్సిల్ ట్రెజరర్ వనం శ్రీనివాసరావు విచ్చేసి అంటరాని తన నిర్మూలనకు హరిజన ఉద్ధరణకు ఎంతగానో కృషి చేసి అణగారిని వర్గాలకు స్త్రీలకు చదువు ఎంత అవసరమో తెలియచెప్పిన మహానీయుడు అని అన్నారు. కార్యక్రమంలో డిసిఎస్ పెంకే శివకుమార్, బుజ్జి, కిరణ్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ రుణాలకు భారీగా దరఖాస్తులు

● జిల్లా వ్యాప్తంగా 34,767 దరఖాస్తు లు ● మంజురైన యూనిట్లు 2335





**జి.కొండూరు,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** వివిధ కార్పొరేషన్ రుణాలకు బీసీ, మైనార్టీ, కాపు, వైశ్య , క్షత్రియ, బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ, మేదర, కుమ్మరి కులాల యువతీ యువకులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మండల, మున్సిపల్ పరిధిలో 34,764 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసు కున్నట్లు అధికారుల గణంకాలు చెబుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా 2335 యూనిట్లు మంజూరు అయ్యాయి.దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు బ్యాంకర్ల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు.ఎంపిక చేసిన అభ్యర్థుల వివరాలను ఎంపీడీఓ,కమిషనర్ల లాగిన్ నుంచి సంబంధిత బ్యాంకు మేనేజర్ల లాగిన్‌లోకి పంపిస్తారు.ఈసారి కొత్తగా యూనిట్ విలువ నిర్ధారించలేదు.యూనిట్ ఆధారంగా రుణాలు మంజూరు చేస్తారు.అలాగే కొత్తగా జనరిక్ షాపుల కు అవకాశం కల్పించారు. డీ-ఫార్మసీ, బీ- ఫార్మసీ వంటి కోర్సులు చేసిన నిరుద్యోగ బీసీ యువతకు జనరిక్ మందుల దుకాణాలు ఏర్పాటు చేసుకోవడానికి రుణాలు అందిస్తున్నారు. ఒక్కో యూనిట్‌కు రూ.8 లక్షల వరకూ ఖర్చుకానుండగా అందులో 50 శాతం అంటే రూ. 4 లక్షలు రాయితీ ఇస్తారు.మిగతా రూ.4 లక్షలు బ్యాంకు రుణంగా ఇవ్వనున్నారు.

**సామాజిక వర్గాల వారీగా:** జిల్లా వ్యాప్తంగా బీసీ కార్పొరేషన్ రుణాలకోసం 1466 యూనిట్లు మంజూరు కాగా 23975 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. కాపు కార్పొరేషన్ రుణాల కు సంబంధించి 508 యూనిట్లు మంజూరు అయితే వీటికోసం 6840 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అలాగే ఈ డబ్ల్యూ ఎస్ కార్పొరేషన్ కు సంబంధించి 361 యూనిట్లు మంజూరు కాగా 3952 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడం జరిగింది.ఇంటర్వ్యూ కి హాజరైన అభ్యర్థులకు వారు ఎంచుకున్న యూనిట్లను గ్రౌండ్ చేసే ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు తెలిపారు.ఎవరైతే రుణాలకోసం దరఖాస్తు చేసుకొని ఇంటర్వ్యూలో అర్హత సాధించారో ఆ అభ్యర్థులు ముందుగా వారు ఎంచుకున్న బ్యాంకులలో లోన్ ఎకౌంటు (ఖాతా) ఓపెన్ చేయాలి.లోన్ ఎకౌంట్ కు సంబంధించి సిబిల్ స్కోర్ ఆధారంగా కార్పొరేషన్ నుంచి సబ్సిడీ ఋణం జమ అవుతుంది. దాని ప్రకారం బ్యాంకర్లు రుణాలు మంజూరు చేస్తారు. సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్నట్లయితే అలాంటి అభ్యర్థుల దరఖాస్తులు తిరస్కరింపబడతాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. మరోవైపు మంజూరు చేసిన యూనిట్లకు వచ్చిన దరఖాస్తులకు చాలా వ్యత్యాసం ఉంది.రుణాల కోసం చాలామంది అభ్యర్థులు ఎదురు చూడటం విశేషం.

**వెనుకబడిన వర్గాలు, ఈడబ్ల్యూఎస్ వర్గాల వారికి ఆర్థికంగా చేయూత అందించి స్వయం ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది.దీనిలో భాగంగా బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించేందుకు సిద్ధమయ్యింది. ఈ మేరకు ఉమ్మడి కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లోని వెనుకబడిన తరగతుల సేవా సహకార సంస్థ దరఖాస్తులు స్వీకరించింది.ఇప్పటికే రుణాల కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఇంటర్వ్యూ ప్రక్రియ కూడా ముగిసింది.అనంతరం సంబంధింత ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదించాల్సి ఉంటుంది.అయితే 50 శాతం సబ్సిడీ తో బీసీలకు రుణాలు అందించనున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం 2024-25 సంవత్సరానికి రాయితీపై రుణాలు అందించేందు కు బీసీ వర్గాలకు రూ.896 కోట్లు, ఈడబ్ల్యూఎస్ రూ.384 కోట్లు బడ్జెట్ లో కేటాయించారు.**

## చలివేంద్రాన్ని ప్రారంభించిన చిరంజీవి యువత



**కంకిపాడు,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** మండల కేంద్రమైన కంకిపాడు లోని చెత్త సంపద కేంద్రం వద్ద చిరంజీవి యువత ఆధ్వర్యంలో కస్తూరి చిట్టిబాబు తండ్రి కస్తూరి సీతారామస్వామి జ్ఞాపకార్థం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని సీతారామస్వామి సతీమణి ఝాన్సీ లక్ష్మి, చిరంజీవి యువత ప్రతినిధులు ముప్పా రాజా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా చిరంజీవి, పవన్ కళ్యాణ్ యువత ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి, కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే



**ఇబ్రహీంపట్నం,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో ఇంకా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి మైలవరం నియోజకవర్గం సమన్వయకర్త జోగి రమేష్ పాల్గొని జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతకై అవిశ్రాంతంగా కృషి చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని ఆయన చేసిన పోరాటాలు, సేవలను కొనియాడారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే కు టిడిపి నాయకుల నివాళులు



**ఇబ్రహీంపట్నం,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** మహాత్మ జ్యోతిరావు పూలే 198వ జయంతి సందర్భంగా కొండపల్లి టిడిపి నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎర్రబ్రిడ్జి వద్ద గల జ్యోతిరావు పూలే విగ్రహానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జంపాల సీతారామయ్య మాట్లాడుతూ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి విశేష కృషిచేసిన మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మరించుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలన కోసం పూలే అలుపెరుగని పోరాటం చేశారు. స్త్రీ విద్య కోసం పోరాడిన గొప్ప సంస్కర్త జ్యోతిరావు పూలే. సమసమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం ప్రతిఒక్కరికి స్ఫూర్తిదాయకం. పూలే ఆశయ సాధనకు పునరంకితం కావడమే మనం అర్పించే ఘన నివాళి అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు చుట్టకుదురు శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు గంగ మధుసూదన్ రావు, గారు కౌన్సిలర్లు,పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీలకు అండగా తెలుగుదేశం కృషి చేస్తుంది

● మహాత్మ జ్యోతిరావ్ పూలే జయంతి వేడుకలు

● టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్



**అమరావతి,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** మహానేత, సమాజ సంఘసంస్కర్త, మహిళా విద్యా ప్రవర్తకుడు మహాత్మ జ్యోతిరావ్ పూలే మానవ సమానత్వానికి, అణగారిన వర్గాల ఎదుగుదలకు జీవితాంతం పోరాడారని అయన చూపిన మార్గం నేటికీ సమాజానికి మార్గదర్శకంగా నిలుస్తోందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ అన్నారు. మంగళగిరి తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యాలయంలో పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంలో పాతర్ల రమేష్ మాట్లాడుతూ మనమంతా పూలే ఆలోచనల్ని, ఆత్మీయతను ప్రజలలోకి తీసుకెళ్లాలని, వారి కలల సమాజాన్ని నిర్మించేందుకు కృషి చేయాలని మనస్ఫూర్తిగా పిలుపునిస్తూన్నారు. కుల, వర్గ, లింగ, వివక్షపై పూలే గలమెత్తి పోరాటం చేశారని ఆయన తెలిపారు. బీసీల అభ్యున్నతికి ఆది నుంచి తెలుగుదేశం పార్టీ, నందమూరి తారక రామారావు, చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ లు కృషి చేస్తున్నారని ఆయన కొనియాడారు. కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు జ్యోతిరావు పూలే అని ఆయన గుర్తు చేశారు. స్త్రీల అభ్యున్నతికి, స్త్రీల విద్యకు పూలే కృషి చేశారని ఆయన తెలిపారు. మహిళలకు విద్యను అందించాలని లక్ష్యంతో అతని భార్య సావిత్రిబాయి పూలే తో కలసి 1848 లో పూణేలో మొదటి పాఠశాలను ఆయన ప్రారంభించారని ఆయన తెలిపారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మ జ్యోతిరావు పూలే 119వ జయంతి సందర్భంగా వెనుకబడిన వర్గాల అభివృద్ధికి అవిశ్రాంతంగా కృషి చేసిన మహనీయులు మహాత్మ పూలే అని పాతర్ల రమేష్ అన్నారు.

## కళాశాల స్థాయి నుండి ఒలంపిక్స్ దాక క్రీడా కారులు రాణించాలి.




**గుంటూరు,ఏప్రిల్ 11 (వార్తాప్రభ) :** నిరంతర సాధన, కార్య దీక్ష, లక్ష్యం కోసం తపన వున్నప్పుడు ప్రతి ఒక్క క్రీడా కారుడు తప్పకుండా ఒలంపిక్స్ స్థాయికి చేరుకుంటారని టి జె పి యస్ కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండంట్ కె. వి. బ్రహ్మం పేర్కొన్నారు. స్థానిక టి జె పి యస్ కళాశాల డిగ్రీ చదువుతున్న వి భార్గవి ( బి కామ్, మొదటి సంవత్సరం),సైక్లింగ్, కృష్ణ బాబు ( బి కామ్, మొదటి సంవత్సరం)వెయిట్ లిఫ్టింగ్, వి. విల్ స్మిత్ ( ఇంటర్ ద్వితీయ సంవత్సరం ) ఫూట్ బాల్ క్రీడలలో రాణించిన ముగ్గురు క్రీడా కారులు ఆల్ ఇండియా పోటీలకు ఎంపికైన సందర్భంగా వాళ్ళకు కళాశాల అధ్యక్షులు పోలిశెట్టి శ్యాంసుందర్, సెక్రటరీ కె. వి. బ్రహ్మం, ప్రిన్సిపాల్ డాక్టర్ బి. వి. హెచ్ కామేశ్వర శాస్త్రి, పి. జి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యస్ అనితా దేవి, వ్యాయామ అధ్యాపకులు ఆర్ శివాజీ అభినందనలు తెలియచేశారు.వీరికి ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమం లో సెక్రటరీ మాట్లాడుతూ క్రీడలలో రాణించే విద్యార్థులకు కళాశాల నుండి ప్రోత్సహం ఎల్లప్పుడూ ఉంటుందని, ఫీజులలో రాయితీ ఉంటుందని, ఈ అవకాశాన్ని క్రీడాకారులు వినియోగించుకోవాలని చెప్పారు. ఆల్ ఇండియా స్థాయిలో పోటీలకు వెళ్తున్న క్రీడాకారులను కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు అభినందించారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188